






నరుడు.. వానరుడు!

అడవుల్లో ఉండాల్సిన వానరమూక జనారణ్యంలోకి ఎందుకొస్తుంది..? ఇది సమాధానంలేని ప్రశ్న.. ఒకనాడు వానరమూకను చూడాలంటే అటవీ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది.. మరిప్పుడో జనారణ్యాన్నే అడవులుగా మార్చుకుంటున్నాయి.. ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నాయి.. కోతి చేష్టలతో జనాలను ఇబ్బంది పెడుతున్నాయి..పై చిత్రంలోనే వానరమూకను చూడండి.. ఒక గోడ ఎక్కడానికి ఎంత హడావుడి చేస్తున్నాయో. అటు పంటలను నాశనం చేస్తున్నాయి.. ఇటు ఇళ్లపై దాడులు చేస్తున్నాయి.. తట్టుకోలేని జనం బాబోయ్ వా..నరకం భరించలేకపోతున్నాం.. అడవులకు తరలించాలని వేడుకుంటున్నారు.. వానరాలు అడవులను వదిలి జనారణ్యంలోకి ఎందుకొస్తున్నాయనే దానిపై అటవీ అధికారులు దృష్టిపెట్టాలి మరి.. - వివరాలు 6లో

కుడితే అంతేనండోయ్!

ఈ చిత్రంలో పురుగు చూస్తే దోమలా ఉంది కదూ.. ఆ జాతికి చెందినదే అయి ఉండొచ్చు కానీ.. దోమ మాత్రం కాదు.. ఇటీవల స్క్రబ్ టైఫస్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి.. కాకినాడ జిల్లాలో ఈ తరహా కేసులు అధికంగా ఉన్నాయి.. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో మాత్రం ఇంత వరకూ నమోదు కాలేదు.. స్క్రబ్ టైఫస్ ఎలా వస్తుందంటే ఒక నల్లి లాంటి పురుగు కుట్టడం ద్వారా సంక్రమిస్తుందని చెబుతున్నారు.. అది ఎలా ఉంటుందనేది ఇప్పటి వరకూ ఎవరికీ తెలియదు.. అయితే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రం ఇప్పటికే చర్యలు చేపట్టారు. అనుమానితులకు ర్యాపిడ్ టెస్ట్‌లు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.. ఈ మేరకు జిల్లా కేంద్రాల్లోని ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా ర్యాపిడ్ కిట్‌లు సిద్ధం చేశారు. వైద్యాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. - వివరాలు 7లో



అభలే!

మహిళా రాపిడోలు..రయ్‌రయ్

ఆమె లేని రంగమేదైనా ఉందా... అందుగలదు.. ఇందులేదని సందేహం వలదు..ఎందెందు వెదికినా ఆమె గలదు.. ఎందుకంటే.. ఏ రంగమైనా మేం సైతం అంటున్నారు.. కూటమి సర్కారు కూడా స్త్రీశక్తికి జైకొడుతోంది.. మహిళల ఆర్థిక స్వావలంభనకు తన వంతు అండగా నిలుస్తోంది.. ఎదుగుదలను ప్రోత్సహిస్తోంది.. గతంలో కాకినాడ, రాజమహేంద్రవరంలో 50 మంది మహిళలకు సబ్సిడీపై రాపిడో ఈ బైక్‌లను ప్రోత్సహించింది.. ఆదరణ బాగుండడంతో ఏకంగా 255 బైక్‌లను రంగంలోకి దించేందుకు సమాయత్తమవుతోంది.. మహిళలు భలేభలే అంటూ ఉత్సాహం చూపుతున్నారు.





మహిళలకు ఈ బైక్‌లు ఇస్తున్న కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ(ఫైల్)

- ఉమ్మడి జిల్లాలో మహిళలకు ఛాన్స్
- త్వరలో మెప్మా ఆధ్వర్యంలో ఎంపిక
- కాకినాడ జిల్లాలో 230
- రాజమహేంద్రవరంలో 25 మంది
- సబ్సిడీపై ఈబైక్‌లు అందజేత
- గతంలో మహిళా రైడర్లకు ఆదరణ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెప్మా ద్వారా రాపిడో ఈ బైక్‌లు ఇచ్చి ప్రోత్సహిస్తోంది.ప్రస్తుతం కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా రాపిడో ఈ వాహనాలకు ఆదరణ బాగుండడంతో కొత్తగా మరింత మందికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. కాకినాడ జిల్లాలో 230 మంది, రాజమహేంద్రవరంలో మరో 25 మందిని ఎంపిక చేయడానికి కసరత్తు ప్రారంభించింది.మరోపక్క డ్వాక్రా గ్రూపుల్లో మహిళలు రాపిడో ద్వారా బైక్‌లు నడపడానికి ముందుకు వస్తే ఆ సంస్థకు తొలి మూడు నెలలు ప్లాట్‌ఫాం ఛార్జీలు చెల్లించక్కర్లేకుండా ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది.ఆ తర్వాత నుంచి నెలకు వెయ్యి చెల్లించాల్సి ఉండగా ఒక్కో వాహనానికి నెలకు 300 బుకింగ్‌లు రాపిడో ఇవ్వనుంది.

రాబడి రయ్..రయ్...

మహిళలు ఆర్థికంగా ఎదిగేలా చేసేందుకు రాష్ట్రప్రభుత్వం రాపిడో సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. జిల్లాల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ద్వారా స్వయం సహాయక బృందాల్లోని సభ్యులను ఎంపిక చేసి వారికి ఎలక్ట్రికల్ బైక్‌లు అందిస్తోంది. దీంతో వీరు నిత్యం రాపిడో ద్వారా ప్రయాణీకులను వారి గమ్య స్థానాలకు బైక్‌లపై చేర్చి నెలనెలా కొంత ఆదాయం సంపాదించుకునేలా చేయాలని లక్ష్యం పెట్టుకుంది.మహిళలు సురక్షితంగా తమ ప్రాంతాలకు వెళ్లడానికి రాపిడో ద్వారా మహిళలే వస్తే వారికి స్వయం ఉపాధి లభించినట్లవు తుందని ప్రభుత్వం భావించింది. అందులో భాగంగా ఈ ఏడాది జూన్ నుంచి పథకాన్ని పట్టాలెక్కించింది. పైలట్ ప్రాజెక్టు కింద తొలుత కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో చెరో 25 మంది మహిళలను ఎంపిక చేసింది. వీరంతా స్థానికంగా ఉన్న డ్వాక్రా గ్రూపు మహిళలే. వీరికి బ్యాంకు ద్వారా ఎలక్ట్రిక్ బైక్‌కు రుణం ఇప్పించింది. అటు ప్రభుత్వం తరఫున రూ.15 వేల వరకు సబ్సిడీ అందించింది. ఇప్పుడు ఈ మహిళంతా రాపిడో ద్వారా ఈ బైక్‌లతో ఎంచక్కా తిరుగుతున్నారు.ఒక్కో రాపిడో మహిళా బైక్ రైడర్‌కు నెలకు రూ.18 వేల నుంచి రూ.22 వేల వరకు ఆదాయం లభిస్తోంది.రైడ్‌లకు వెళితే రోజుకు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు ఆదాయం సంపాదిస్తున్నారు.

కాకినాడలో..

కాకినాడ నగరంలో మెప్మా ద్వారా ఎంపిక చేసిన మహిళలకు రాపిడో ద్వారా ఆదాయం బాగుండ డంతో మరింత మంది మహిళలను ఎంపిక చేయడానికి అధికారులు సన్నా హాలు చేస్తున్నారు. త్వరలో మరో 75 మందిని రాపిడోతో అనుసంధానించబోతున్నారు. కాకినాడలో ఆదరణ బాగుండడంతో మొత్తం వంద మందిని ఎంపిక చేయాలని మెప్మా లక్ష్యం విధించుకుంది.పిఠాపురం మునిసిపాలిటీ పరిధిలో 25, సామర్లకోట 30, పెద్దాపు రం 25, గొల్లప్రోలు 25, తుని 25, ఏలేశ్వరంలో 25 మంది చొప్పున మొత్తం జిల్లాలో కాకినాడ కార్పొరేషన్, మిగిలిన మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు కలిపి త్వరలో 255 మందిని ఎంపిక చేయనున్నారు. తద్వారా ఎలక్ట్రిక్ బైక్‌లు కొనుగోలుకు రూ.5.28 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు. డ్వాక్రా గ్రూపు సభ్యుల్లో ఒకరు లేదా వారి కుటుంబ సభ్యుల్లో ఆసక్తి కలిగిన వారిని అధికారులు ఎంపిక చేస్తున్నారు.

రాజమహేంద్రవరంలో..

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలో ఇప్పటికే 25మంది రైడర్లు ఉండగా, మరో 25 మందిని ఎంపిక చేయ డానికి కసరత్తు మొదలుపెట్టారు. తొలుత ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన 25 మందిలో కొందరి ఈ బైక్‌లు విజయవాడ నుంచి రప్పించడంతో తరచూ మరమ్మతుకు గురవుతున్నట్టు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఎంపిక చేయనున్న మహిళా రైడర్లకు ఇకపై రాజమహేంద్రవరంలోనే ఎలక్ట్రిక్ బైక్‌లు అందించేలా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నారు.

మరి కొన్ని మునిసిపాలిటీలు

కొవ్వూరు, నిడదవోలు మున్సిపాల్టీలు, కోన సీమ జిల్లాలో అమలాపురం, మండపేట, రామ చంద్ర పురం మునిసిపాలిటీల్లోనూ ఈ సర్వీ సులు కొనసాగేలా అధికారులు ప్రయత్నం చేశారు. మెప్మా అధికారులు స్థానిక ప్రజా ప్రతి నిధులతో మాట్లాడారు. ప్రస్తుతం కొన్ని మునిసిపాలిటీల పరిధిలో డిమాండ్ లేదని, ఉన్న రూట్లలో త్వరలో బైక్‌లు లేదా ఎలక్ట్రికల్ ఆటోలు నడిపేలా మహిళలను ఎంపిక చేయాలని భావిస్తున్నారు.

నేడు జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక పరీక్ష

- జిల్లావ్యాప్తంగా 3106 మంది విద్యార్థులకు 14 పరీక్షా కేంద్రాలు

అమలాపురంరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌ను అందించేందుకు ఎంపిక పరీక్ష ఆదివారం నిర్వహిస్తున్నట్టు డీఈవో షేక్ సలీంబాషా తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్ఎంఎస్ పరీక్ష జరుగుతుంది. జిల్లావ్యాప్తంగా 3,106 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. వీరి కోసం రెవెన్యూ డివిజన్ పరిధిలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అమలాపురం డివిజన్ పరిధిలో 6, కొత్తపేట డివిజన్‌లో 4, రామచంద్రపురం డివిజన్‌లో 4 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నాలుగేళ్ల పాటు జాతీయ ఉపకార వేతనం అందుతుందన్నారు.

పోలీసు వ్యవస్థకు హోంగార్డులే వెన్నెముక

- హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవంలో ఎస్పీ రాహుల్ మీనా



జిల్లా ఎస్పీ రాహుల్‌మీనాను సన్మానిస్తున్న హోంగార్డు ఉద్యోగులు

అమలాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీసు వ్యవస్థకు హోంగార్డులు వెన్నెముక వంటివారని జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా అన్నారు. అమలాపురంలోని ఎస్పీ కార్యాలయ ఆవరణలో హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పోలీసు వ్యవస్థ బలోపేతంలో హోంగార్డుల సేవలు కీలకమైనవన్నారు. హోంగార్డులు ఎలాంటి స్వార్థంలేకుండా నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ పోలీసుశాఖకు అదనపు బలాన్ని అందిస్తున్నారన్నారు. ట్రాఫిక్ నియంత్రణ నుంచి మొదలుకుని శాంతి భద్రతల పరిరక్షణ, కమ్యూనిటీ పోలీసింగ్, బందోబస్తు విధులు, అత్యవసర సమయాల్లో సహాయక చర్యలు వంటి అన్ని విభాగాల్లోను హోంగార్డుల సేవలు వెలకట్టలేనివన్నారు. జిల్లాలోని హోంగార్డుల సంక్షేమానికి పోలీసుశాఖ ఎప్పుడూ అధిక ప్రాధాన్యమిస్తుందని, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. తొలుత హోంగార్డుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించి పెరేడ్‌ను పరిశీలించారు. అనంతరం క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేయడంతోపాటు ఉత్తమ సేవలందించిన సిబ్బందిని ఎస్పీ ఘనంగా సత్కరించారు. అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, డీసీఆర్బీ సీఐ మురళీకృష్ణ, ఆర్ఐ కోటేశ్వరరావు, బ్రహ్మానందంతోపాటు పట్టణ సీఐ వీరబాబు పాల్గొన్నారు.

అంబేడ్కర్ బోధనలు ప్రజాస్వామ్యానికి పునాది

- వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

అమలాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బోధనలు దేశ ప్రజాస్వామ్యపు పునాది అని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. విద్యాహక్కు, మహిళా సాధికారిత, సామాజిక సమానత్వంకోసం అంబేడ్కర్ చేసిన పోరాటం ప్రతి భారతీయుడి జీవితానికి దిశానిర్దేశమన్నారు.అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో శనివారం అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించగా చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ చూపిన మార్గంలో నడవడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అన్నారు.

కలెక్టర్ కార్యాలయంలో..

అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో కె.మాధవి ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యాలయ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. డీఆర్వో మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనలు విప్లవాత్మకం, విస్తృతమైనవన్నారు. సెక్షన్ సూపరింటెండెంట్ రమణ, కుమారి, సుబ్బరాజు, నాగలక్ష్మమ్మ, భరత్, వంశీ, శివరాజ్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో మాధవి

13 ప్రైవేటు ట్రావెల్ బస్సులపై కేసులు

- రూ.26,300 అపరాధ రుసుం
- రహదారి భద్రతకు ప్రాధాన్యమివ్వాలి
- జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు

ముమ్మిడివరం,డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా నియమాలను ఉల్లంఘనను ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించేది లేదని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు హెచ్చరించారు. ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్‌ప్లాజా, ఈతకోట టోల్‌ప్లాజా వద్ద శనివారం తనిఖీలు నిర్వహించారు. 13ప్రైవేటు ట్రావెల్ బస్సులపై కేసులు నమోదు చేసి రూ.26,300 అపరాధ రుసుం విధించినట్టు జిల్లా రవాణాధికారి తెలిపారు. బస్సు భద్రతా ప్రమాణాలు, రహదారి భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తూ జిల్లాలో ప్రతివారం ప్రైవేటు ట్రావెల్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. మంచు కురిసే సమయాల్లో పరిమితమైన వేగంతో బస్సులు నడపాలని, రహదారి భద్రతా ఉల్లంఘనను ఉపేక్షించేది లేదని అన్నారు. భద్రతా నియమాలు ఉల్లంఘించిన బస్సులపై కేసులు నమోదు చేసి డ్రైవింగ్ లైసెన్సులను సస్పెండ్ చేస్తామని, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, జ్యోతిసురేష్, ఓలేటటి శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, షణ్ముకశ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రైవేటు బస్సులు తనిఖీ చేస్తున్న ఆర్టీవో శ్రీనివాసరావు

పంట్లు కదలవా?

- వరదలు తగ్గినా నేటికీ ప్రారంభం కాని రాకపోకలు
- కోటిపల్లి-ముక్తేశ్వరం మధ్య ఏడునెలలుగా ఇదే పరిస్థితి
- లంకల్లో రైతులతోపాటు వివిధ వర్గాల ప్రజలకు తీవ్ర ఇక్కట్లు



రాకపోకలు లేకపోవడంతో గోదావరి నదిలో కోటిపల్లి వైపు నిలిచిపోయిన పంట్లు



కోటిపల్లి వైపు గోదావరి వద్ద మూసివేసి ఉన్న టికెట్ కౌంటర్



ముక్తేశ్వరం వైపు రేవులో గోదావరి వరదలకు దెబ్బతిన్న రోడ్డు

మండపేట,డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న ముక్తేశ్వరం-కోటిపల్లి రేవులో పంటు ముందుకు కదలడంలేదు. గోదావరి వరదల కారణంగా ఈ ఏడాది జూన్‌లో పంటు రాకపోకలు నిలిచిపోయాయి. ఏడునెలలు కావస్తున్నా నేటికీ రాకపోకలు పునరుద్ధరణ జరగలేదు.

ముక్తేశ్వరం-కోటిపల్లి రేవు మూతపడడంవల్ల అటు లంకల్లో పంటలు పండించే రైతులతోపాటు కోనసీమ జిల్లాకేంద్రం అమలాపురం, రామచంద్రపురం,పి.గన్నవరం నియోజకవర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం నుంచి బస్సులో కోటిపల్లి చేరుకునే భక్తులు కోటిపల్లిలో సోమేశ్వరస్వామిని,ద్రాక్షారామలో భీమేశ్వర స్వామిని దర్శించుకుంటారు. తర్వాత అవతలవైపు ఉన్న ఐనవిల్లి వినాయ కుడిని దర్శించుకోవడానికి పంటుపై వెళ్తుంటారు.కానీ రేవు మూతపడడంతో ఆ పరిస్థితి ఉండడంలేదు. వరదలు ఎప్పుడో తగ్గినా రాకపోకలు జరగడంలేదు. రేవులో ఇరువైపులా రోడ్డు గోదావరి వరదలకు కొట్టుకుపోవడమే దీనికి కారణంగా చెప్తున్నారు. రేవుకు ఇరువైపులా రోడ్డు వేయాలంటే భారీగా నిధులు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. జడ్పీ ఆధ్వర్యంలో వీటిని నిర్మించాల్సి ఉంది. ప్రభుత్వం ఇంకా అంచనాలను ఆమోదించలేదని సమాచారం.

ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

గోదావరికి ఇరువైపులా రేవు మెరక కావడం, నది పోటుకు రాకపోకలు సాగించే రోడ్డు ముంపునకు గురికావడంవల్ల ముక్తేశ్వరం వైపు రోడ్డు ఎత్తుగా వేయాల్సి ఉంది. రేవు మూతపడడంవల్ల ఆర్టీసీ బస్సుల్లో కోటిపల్లి వచ్చే ప్రయాణికుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. ఈ ఏడాది కార్తీకమాసం సమయానికి రేవు మూతపడడంతో దాని ప్రభావం ఆలయాలపై తీవ్రంగా పడింది. లంకల్లో పండించే పంటలను రైతులు బయట ప్రాంతాలకు నాటు పడవల ద్వారా తరలించుకుంటున్నారు. ఈ రేవుల మీదుగా సాధారణ ప్రజలతోపాటు రైతులు,వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగించేవారు. పంట్లు నిలిచిపోవడంతో వీరంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రేవుగుండా కాకినాడ నుంచి కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం చాలా దగ్గరగా ఉండేది. ప్రస్తుతం ఇక్కడ ప్రజలు యానాం లేదా రావులపాలెం మీదుగా అమలాపురం వెళ్లాల్సి వస్తోంది. వచ్చేఏడాది శివరాత్రి కూడా రానుంది. అప్పుడు ఇరువైపులా కోటిపల్లి, ముక్తేశ్వరం ఆలయాల్లో భక్తులతో సందడి నెలకొంటుంది. రాకపోకలు ఎక్కువగాఉంటాయి. ఈనేపథ్యంలో కోటిపల్లి-ముక్తేశ్వరం రేవుల్లో దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించి, వచ్చేజనవరినాటికైనా పంటుప్రయాణాలు పునఃప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

బీపీఎస్ సేవలు ఉపయోగించుకోండి

- అముడా చైర్మన్ స్వామినాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న స్వామినాయుడు

అమలాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలు ప్లాన్‌లకు భిన్నంగా నిర్మిస్తే పీనల్ అమౌంట్ చెల్లించి వాటిని క్రమబద్ధీకరించుకోవడానికి బీపీఎస్-2025 స్కీమ్‌ను ప్రభుత్వం ప్రకటించిందని అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు తెలిపారు. ఈ స్కీమును జిల్లాలోని అముడా పరిధిలోని పంచాయతీల్లో అనధికారిక భవన యజమానులు వినియోగించుకుని క్రమబద్ధీకరించుకోవాలని ఆయన సూచించారు. అమలాపురంలోని అముడా కార్యాలయంలో చైర్‌పర్సన్ స్వామినాయుడు అధ్యక్షతన శనివారం జరిగిన లైసెన్స్ సర్వేయర్లకు పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ప్లానింగ్ ఆఫీసర్ సత్యమూర్తి, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ ఉమామహేశ్వరరావు, ఏవో చిట్టిబాబు పాల్గొన్నారు.

రెండుచోట్ల రక్తపింజరి సర్పాల హతం 6

సహకార ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి.. రేపటి నుంచి దశలవారీగా ఆందోళనలు

అమలాపురం టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సహకార ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 8నుంచి దశలవారీ ఆందోళనలు చేపట్టినట్టు యూనియన్ జిల్లాశాఖ అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు తెలిపారు. జీవో నెంబరు 36ను తక్షణం అమలు చేయాలని, 2019, 2024 వేతన సవరణ వెంటనే అమలు చేయాలని, గ్రాట్యుటీ యాక్టు అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘ ఉద్యోగులు ఆందోళనకు దిగుతున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. దశలవారీ ఆందోళనలో భాగంగా ఈ నెల 8న డీసీసీబీ బ్రాంచి కార్యాలయాల ఎదుట సహకార సంఘాల ఉద్యోగుల ధర్నా, 16న జిల్లా సహకార సంఘ కార్యాలయంవద్ద ధర్నా, 22న అన్ని డీసీసీబీ ప్రధాన కార్యాలయాల వద్ద ధర్నాలు, 29న సహకార సంఘాల ఉద్యోగులతో విజయవాడ ధర్నాచౌక్‌లో మహాధర్నా, జనవరి 5 నుంచి సమస్యల పరిష్కారానికి విజయవాడ ధర్నాచౌక్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. తొలుత జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్(సీఐటీయూ) జిల్లా కార్యవర్గ సమావేశం అమలాపురం కేవీఆర్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు తోట వెంకట్రామయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వై.రామచంద్రరావు, రాష్ట్ర కోశాధికారి పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కోతుల నుంచి రక్షణకు మెస్..

అది ఒక ఆశ్రమం.. ప్రసాదం పెడితే చాలు కోతల మూకలు వాలిపోతున్నాయి.. కోతుల నుంచి రక్షణకు ఏం చేయాలని ఆలోచించా రు.. భక్తులకు ప్రసాదం పంపిణీ చేసే ప్రదేశం చుట్టూ ఇనుప కంచె వేశారు.. అయినా పైనుంచి వచ్చి కోతులు దాడి చేస్తున్నాయి..దీంతో పైనుంచి రాకుండా ప్రత్తిపాడు మండలం రాచపల్లి రమణ ఆశ్రమంలో భోజన ప్రదేశం వద్ద ఇనుప మెస్సులు వేశారు. ఈ ఒక్క సంఘటన చాలు కోతి చేష్టల పరిస్థితి చెప్పడానికి..

కోతులు పట్టించేందుకు ఇంటికి రూ.వెయ్యి..

కోతుల అలజడికి తునిరూరల్ గవరపేటలో గ్రామస్తులు ఇళ్ల నుంచి బయటకు రావడానికి హడలెత్తిపోతున్నారు. ఆదమరిస్తే ఇళ్లలోకి చొరబడి తినుబండారాలతో పాటు వంట సామగ్రి ధ్వంసం చేస్తున్నాయి. స్కూల్ పిల్లల వద్ద లంచ్‌బాక్సులు లాక్కుని దాడి చేస్తున్నాయి. కోతుల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గవరపేట గ్రామస్తులు ఏకతాటిపైకి వచ్చారు. ఇంటికొక రూ.1000 చందా వేసి ఒక కోతికి రూ.5 వేల చొప్పున వెచ్చించి వందలాది కోతులను పట్టించారు. వీటిని భద్రంగా ప్రత్యేక వాహనంలో ఏజెన్సీ ప్రాంతానికి తరలించారు. అయినా బెడద మాత్రం తీరలేదు..

కోతులకో కాపలాదారుడు..

రాజానగరం మండలంలో కోతులు పండ్ల తోటలపై ఇష్టానుసారం దాడి చేస్తున్నాయి.. నిమ్మపూత గిల్లడం, బొప్పాయి, అరటి మొక్కలను వేస్తుండగానే పీకేయడం, సీతాఫలాన్ని కాయ దశలోను, జీడిగింజలను తెంపేయడం వంటి కోతిచేష్టలతో రైతులు బాగా నష్టపోవాల్సి వస్తోందని శ్రీకృష్ణపట్నానికి చెందిన రైతు దొడ్డా అర్జున్ వాపోయాడు. కోతుల బారి నుంచి పంటను రక్షించుకోవడానికి రోజుకు రూ.700 నుంచి రూ.వెయ్యి వరకూ జీతాలుగా ఇచ్చి కాపలాదారులను ఏర్పాటు చేసుకుంటున్నారు. అయినా దాడులు ఆగడంలేదు.



వానరకమే!



తహశీల్దార్‌కు గతంలో కూనవరం విజయసాధన పాఠశాల విద్యార్థుల వినతి

కోతులను కొట్టడానికి కర్రలు అమ్ముతారక్కడ?

కూనవరంలో కోతులను తరిమేందుకు దుకాణాల్లో ప్రత్యేకంగా కర్రలను విక్రయిస్తున్నారు. ఎందుకంటే వాటి తీరు అంతదారుణంగా ఉంది. ఇటీవల కూనవరానికి చెందిన చుక్కమ్మ అనే వృద్ధురాలిపై కోతులు దాడిచేయడంతో ఆమె తలకు నాలుగు కుట్లు పడ్డాయి. ఇదే గ్రామానికి చెందిన జట్టి సత్యనారాయణ ఆలయానికి వెళ్లి పూజలు చేస్తుండగా ఆయనపై ఒక్కసారిగా కోతులు దాడిచేసి గాయపరిచాయి. విజయసాధన పాఠశాల విద్యార్థులు కోతుల కారణంగా చదువుకోలేకపోతున్నామని తహశీల్దార్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



కోతి చేష్టలు.. ఈ మాట తరచూ వింటుంటాం.. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ప్రత్యక్షంగా చూస్తున్నారు.. ఇబ్బందులు పడుతున్నారు.. అయినా ఏమీ చేయలేక చేష్టలుడిగి చూస్తున్నారు.. ఎందుకో ఏమో కానీ.. ఎక్కడో వనంలో ఉండాల్సిన కోతులు ఇటీవల జనావాసంలోకి చేరాయి.. ఎక్కడిబడితే అక్కడ కనిపిస్తున్నాయి.. గతంలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే కోతుల జాడ ఉండేది.. నేడు అక్కడా ఇక్కడా అని ఏమీ లేదు. కోతులు అడవులను వదిలి జనాల మీద పడుతున్నాయి.. వానరుడిని ఏమీ చేయలేని నరుడు.. నరకం చూస్తున్నాడు.. అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నాడు.. అయినా చర్యలు శూన్యం..

కోతి మూకల దాడులతో జనం బెంబేలు

- జనావాసంలోకి వానరసేన
- మనుషులు కనబడితే దాడి
- సామగ్రి ఎత్తుకెళ్లిపోతున్న వైనం
- ఉమ్మడి జిల్లాలో మరో కష్టం

ప్రత్తిపాడు/తునిరూరల్/ఏలేశ్వరం/దివాన్‌చెరువు/కూనవరం/ ఆత్రే యపురం/ సామర్లకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వనంలో ఉండాల్సిన కోతులు జనంలో సంచరిస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. గుంపులు..గుంపులుగా చేరిన కోతులు రైతులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి.ఊళ్లలోకి చొరబడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.ఇంటి పెరట్లోని మొక్కలన ధ్వంసం చేస్తున్నాయి. పంటలు, పండ్ల తోటలు, గృహాల్లోకి చొరబడుతున్నాయి. ఇళ్లలోకి చొరబడి అందినకాడికి నిత్యావసరాలను ఎత్తుకుపోతున్నాయి.

పాఠశాలలకు వెళ్లే చిన్నారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇటీవల కాలంలో పలువురు వానర మూకల దాడిలో గాయపడి ఆస్పత్రులకు చికిత్స నిమిత్తం వెళ్లిన సంఘటనలు ఉన్నాయి. సామర్లకోటలో కోతులు, కొండము చ్చుల బెడద అధికంగానే ఉంది. సామర్లకోట మాండవ్య నారాయణస్వామి ఆలయం నుంచి భీమేశ్వరాలయం వరకూ ఉన్న రోడ్డు, వ్యవసాయ పరిశోధనా కేంద్రం రోడ్డులోనూ కోతుల బెడద ఉంది. అన్నవరం, అంతర్వేది తదితర పర్యాటక ప్రాంతాల్లోనూ కోతుల దాడి అధికంగానే ఉంటుంది. పంచాయతీ, వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వీటి కట్టడికి చర్యలు శూన్యం. ఇప్పటికైనా అటవీ, పంచాయతీరాజ్ శాఖలు సంయుక్తంగా కోతులు పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.





సామర్లకోట .. అలమండలో

ఇక్కడే.. ఇబ్బంది

ప్రత్తిపాడు, తుని పట్టణానికి ఆనుకుని ఉన్న గ్రామీణ ప్రాం తాలతో పాటు తుని మండలంలో తేటగుంట, గవరపేట, వెంకటాపురం, హంసవరం తదితర గ్రామాల్లో వానరమూక ప్రజలను బెంబేలెత్తిస్తోంది. ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో కోతులు బెడద అధికంగా ఉంది. రాజానగరం మండలంలోని శ్రీకృష్ణపట్నం, శ్రీరాంపురం, రఘునాథపురం, పుణ్యక్షేత్రం, తుంగపాడు గ్రామాల్లో పండ్ల తోటలు అధికం. వాతావరణం అనుకూలించినా వానర మూకల వల్ల రైతులు నష్టాలను ఎదుర్కొంటున్నారు.లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీ, దివాన్‌చెరువు తదితర జనావాస ప్రాంతాల్లో కోతుల బెడద అధికంగా ఉంది. కూనవరంలో కోతుల కారణంగా జనం రోడ్లపై తిరగాలంటనే భయపడుతున్నారు.ఆత్రేయపురం మండలం బొబ్బ ర్లంక, ధవళేశ్వరం బ్యారేజీపై కోతులు కాచుకుని అప్పుడప్పుడు వాహన దారులపై దాడులకు దిగుతున్నాయి. ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో 20వ వార్డుల్లో ప్రజలు ప్రత్యక్షంగా పరోక్షంగా ఇబ్బందులకు గురవుతున్నారు. వీటిని కొట్ట లేరు.. అలాగని పట్టుకోరు.. ఈ మూగజీవాలతో పట్టణంలో 40వేల జనాభాకు నిత్యం నరకం కనిపిస్తోంది. ప్రస్తుతం ఉన్న కఠినమైన చట్టాలతో వీటి సమస్య నానాటికీ ఇబ్బందికరంగా మారుతోంది.

ఒకే విద్యార్థి.. ఒకే టీచరు!

- సామర్లకోట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఇది పరిస్థితి

(ఆంధ్రజ్యోతి-సామర్లకోట)

ఇది కాకినాడ జిల్లా సామర్లకోట మున్సి పాల్టీ పరిధిలోని కోదండరామపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల.. ఇక్కడ ఒకే టీచర్ విధులు నిర్వహిస్తుండగా ఒకే విద్యార్థి విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రభుత్వం మౌలిక నదుపాయాలు కల్పిస్తున్నా, లక్షలాది రూపాయల మేర ఉపాధ్యాయులకు వేతనాల రూపంలో చెల్లిస్తున్నా సర్కారు బడుల వైపు తల్లి దండ్రులు మొగ్గు చూపడం లేదు. చిన్నారుల హాజరు తక్కువగా ఉండడానికి ఇదొక కారణమైతే పాఠశాలల విలీనం మరొక కారణంగా తెలుస్తోంది. మండలానికి ఇద్దరు ఎంఈవోలు, సీఆర్‌పీ వ్యవస్థలు ఉన్నా చిన్నారులను ప్రభుత్వపాఠశాలల వైపు రప్పించలేకపోతున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లా కేంద్రమైన కాకినాడకు 15 కిలోమీటర్ల దూరంలో ఈ పాఠశాల ఉంది. ఇక్కడ ఒకే విద్యార్థి కీర్తి, ఒకే టీచరు గౌతమి మాత్రమే ఉన్నారు. ఈ పాఠశాలకు మధ్యాహ్న భోజన పథకం కూడా అమలు కావడం లేదు.



సామర్లకోటలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని, టీచరు

జీలుగు నీరా నుంచి బెల్లం తయారీ



జీలుగు నీరా నుంచి బెల్లం తయారీపై శిక్షణ ఇస్తున్న వెంగయ్య

- అధిక లాభాలు పొందొచ్చు
- పందిరిమామిడి ఉద్యాన పరిశోధనా క్షేత్రం శాస్త్రవేత్త డాక్టర్ వెంగయ్య
- మోతుగూడెంలో జీలుగుకల్లు సేకరణదారులకు శిక్షణ

మోతుగూడెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొండలపై సహజ సిద్ధంగా పెరిగిన జీలుగు చెట్ల నుంచి నీరా సేకరించి బెల్లం తయారు చేయడం ద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చని సీనియర్ శాస్త్రవేత్త, పందిరిమామిడి ఉద్యాన పరిశోధనా క్షేత్రం శాస్త్రవేత్త డాక్టర్ పీసీ వెంగయ్య తెలిపారు. జీలుగు బెల్లం తయారీపై ఆయన శిక్షణ ఇచ్చారు. చింతూరు మండలం మోతుగూడెం ఎంపీడీ క్యాంప్‌లో ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి వెంగయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

పాత పద్ధతిలో సేకరిస్తున్న జీలుగు కల్లుకు బదులుగా కొత్త పద్ధతిలో పరిశుభ్రంగా నీరా ఎలా సేకరించాలి.. తద్వారా బెల్లం ఎలా తయారు చేయొచ్చు అనే అంశాలపై ఆయన శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులకు నేర్పించారు. ఈ సందర్భంగా వెంగయ్య మాట్లాడుతూ ఒక్కొక్క చెట్టునుంచి సీజన్ మొత్తంలో కనీసం 100 రోజులు నీరా సేకరించి నా రోజుకు 30 లీటర్ల చొప్పున 3000 లీటర్ల ఉత్పత్తి చేయవచ్చునని అన్నారు. శుభ్రంగా నీరా సేకరించి బెల్లం తయారు చేస్తే తామే కొనుగోలు చేస్తా మని తెలిపారు. ఉత్సాహం ఉన్న కొంతమందిని గుర్తించి వారికి తగిన పనిముట్లు, పరికరాలను తమ ఉద్యాన పరిశోధన కేంద్రం తర ఫున ఉచితంగా అందిస్తామని, మరికొన్ని శిక్షణలు ఇప్పించి ఈ ప్రాంతంలోని యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి తడికవాగు, ఇంతలూరు వాగు, ఒడియా క్యాంప్, సింధువాడ, గంగవాడ, శాంతినగరం గ్రామాల నుంచి 24 మంది జీలుగు కల్లు సేకరణదారులు పాల్గొన్నారు. జీలుగు నీరాతో బెల్లం చేసి అమ్మితే ఉపాధి పొందవచ్చునని ఆషా సంస్థ కార్యదర్శి శ్రీసయ్యద్ సుభాని అన్నారు.

అత్యాధునిక వైద్యంపై అవగాహన పెంచుకోవాలి

- ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్ సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ సురేష్‌బాబురెడ్డి

అమలాపురంరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీలో అత్యాధునిక వైద్య విధానాలు ఎన్నో అందుబాటులోకి వచ్చాయని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్ సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ సురేష్‌బాబురెడ్డి పేర్కొన్నారు. అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో రెండురోజులపాటు సదర్నా ఫిజియోస్ వార్షిక పరిశోధన-సాంస్కృతిక మహాసభ-2025 శనివారంతో విజయవంతంగా ముగిసింది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 800 మంది ఫిజియోథెరపిస్టులు, ఫిజియోథెరపీ విద్యార్థులు మహాసభల్లో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సురేష్‌బాబు బేసిక్ ఎమర్జెన్సీ ప్రొసీజర్స్, టేపింగ్ టెక్నిక్, మాన్యువల్ థెరపీ, తదితర అంశాలపై వర్కుషాపులో విద్యార్థులకు వివరించారు. వీటితో పాటు దంతవైద్య, ఫిజియోథెరపీ రంగాల్లో నిపుణులు పీఎంఏలు నిర్వహించారు. ప్రముఖ సినీనటి శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీదేవితో కలసి విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కిమ్స్ డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య, ఉపాధ్యక్షుడు మోహన్ రాజు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. సుబ్బారావు ఆహూతులను సత్కరించారు. అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వైద్యుల బృందాన్ని కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ఎండీ కె.రవికిరణ్‌వర్మ, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ అశోక్‌చక్రవర్తి అభినందించారు.



కిమ్స్‌లో ఫిజియోథెరపీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సురేష్‌బాబురెడ్డి

కూలీల చేతిలో రక్తపింజర హతం



ఆర్.ఏనుగుపల్లిలో వరి చేల్లో రక్తపింజరను చంపిన కూలీలు

పి.గన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లిలో శనివారం వరి చేల్లో కూలీలు రక్తపింజరను హతమార్చారు. గ్రామంలోని ఏటిగట్టు దిగువున పనలు కడుతుండగా రక్తపింజర కనిపించింది. అత్యంత ప్రమాదకరమైన విషసర్పం కావడంతో కూలీలు కర్రలతో కొట్టి చంపారు. గత కొన్ని రోజులుగా పరిసర ప్రాంతాల్లో రక్తపింజర పాములు ఎక్కువగా కనిపించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

అమలాపురం రూరల్: అమలాపురం మండలం సమనస గ్రామానికి చెందిన మంచిగంటి మణికంఠ స్వగృహం వద్ద నిర్వహిస్తున్న డెయిరీఫామ్‌లో రక్తపింజర కనిపించింది. నెల రోజుల క్రితం కనిపించగా, దాని ఆచూకీ కోసం యజమాని వెతికాడు. కానీ కనిపించకపోవడంతో రెండు పర్యాయాలు స్నేక్ క్యాచర్ జంపన రమేష్‌వర్మకు సమాచారం అందించారు. కగా, ఎట్టకేలకు శనివారం రాత్రి కన్నం నుంచి బయటకు రావడంతో వర్మకు సమాచారం అందించడంతో హుటాహుటిన ఆయన అక్కడకి చేరకుని అత్యంత ప్రమాదకరమైన రక్తపింజరని పట్టుకుని బంధించాడు. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.



సమనసలో ఓ డబ్బాలో బంధించిన పాముతో స్నేక్ క్యాచర్

ఆధ్యాత్మికభావం అవసరం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్
- అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో పూజలు

అన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరికీ ఆధ్యాత్మికభావం అవసరమని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం సత్యదేవుడ్ని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.



సత్యదేవుడి దర్శనానంతరం మంత్రి సుభాష్

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యన్నదాన పథకానికి శనివారం ఒక దాత రూ. లక్ష విరాళంగా సమర్పించారు. సత్తుపల్లికి చెందిన పి.కృష్ణారావు ఈ మొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామి వారి ప్రసాదం, ప్రత్యేక దర్శనం కల్పించారు.

వేడుకగా ప్రాకార సేవ

రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 9 గంటలకు ప్రధానాలయం నుంచి స్వామి, అమ్మవార్లను తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు .అక్కడ ప్రత్యేక పూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షణ గావించారు. కార్యక్రమం అనంతరం హారతులిచ్చి ప్రదానాలయానికి తీసుకెళ్లారు.

భక్తజన వాస గోవిందా

- వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన జనం
- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.56,75,591 లక్షలు

ఆత్రేయపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం గోవిందనామస్మరణతో మార్మోగింది. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో వేదపండితులు అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఆలయం ఎదురుగా ఉన్న దీపారాధన మండపంలో మహిళలు దీపాలంకరణ చేశారు. బస్టాండ్ వద్ద మహిళల సందడి నెలకొంది. కొత్త వంతెన నుంచి ఆలయం వరకు బ్యాటరీ వాహనాల ద్వారా భక్తులను ఆలయానికి తీసుకువచ్చారు. 104 వైద్యసిబ్బంది సేవలు అందించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు ఆలయంలో పర్యవేక్షించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. భక్తజన గోవిందనామస్మరణతో ఆలయం మార్మోగింది. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ. 56,75,591 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ఆలయంలో భక్తుల రద్దీ

బాలబాలాజీకి విశేష పూజలు

మామిడికుదురు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీస్వామికి శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం దేవస్థానం భక్తులతో పోటెత్తింది. వేకువజామునే అర్చకులు వేదమంత్రోచ్చారణలతో సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలి హారతి ఇవ్వగా, స్వీకరించిన భక్తులు తన్మయత్వం చెందారు. కొత్త పాత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారిని శనివారం 5200 మంది భక్తులు దర్శించుకున్నారు. అన్నప్రసాదం ట్రస్టులో దాదాపు మూడు వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ. 2,94,060 ఆదాయంగా సమకూరిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన బి.విజయ్‌శంకర్-సుజాత దంపతులు రూ.10,009 విరాళంగా అందించారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



కొలువుదీరిన బాలబాలాజీ స్వామి

సిద్ధి వినాయకుడి సన్నిధిలో సమాచారశాఖ కమిషనర్



అయినవిల్లిలో సునీల్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

అయినవిల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ (విజయవాడ) చావలి సునీల్‌కుమార్ శనివారం కుటుంబ సమేతంగా అయినవిల్లి శ్రీసిద్ధి వినాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. తొలుత వీరికి ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. తర్వాత విఘ్నేశ్వరస్వామి చిత్రపటం, ప్రసాదమిచ్చారు.

సామర్లకోట: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ సునీల్‌కుమార్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమరావతి నుంచి జిల్లా పర్యటనార్థం విచ్చేశారు. ఆయనకు ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), వెంకన్న, అంజిబాబు, తదితరుల వేదమంత్రోచ్చారణల మధ్య సాదరంగా స్వాగతం పలికారు. ముందుగా కాలభైరవస్వామిని దర్శించి ఆలయ ఆవరణలోని అన్ని ఉపాలయాల దేవతామూర్తులను దర్శించారు. తర్వాత భీమేశ్వరస్వామికి విశేష అభిషేక పూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష పుష్పార్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సునీల్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసినవారిలో కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ వై. శ్రీనివాసు, పెద్దాపురం ఎస్‌ఐ మౌనిక, సామర్లకోట వీఆర్వోలు నలజర్ల మురళీకృష్ణ, నూతలపాటి లోవరాజు, తదితరులు ఉన్నారు. అనంతరం ద్రాక్షారామకు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. ఈయన తోపాటు అధికారులు, తదితరులు ఉన్నారు.

ఉమ్మడి జిల్లా అండర్ - 17 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

అంబాజీపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శనివారం జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ కె.ఈశ్వరరావు, ఎ.రమాదేవి పర్యవేక్షణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-17 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొనగా వీరిలో ఆల్‌రౌండర్, బ్యాట్స్‌మెన్, బౌలర్, కీపర్ సామర్థ్యాలను కలిగిన 16 మంది క్రికెట్ జట్టు ఎంపిక చేయడం జరిగిందన్నారు. అలాగే వీరితో పాటు మరో 8 మందిని స్టాండ్ బై సెలక్ట్ చేయడం జరిగిందన్నారు. ఈ నెల 15 నుంచి విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో ఈ జట్టు పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిరాం, సెలక్టర్లు ఆర్.నాగకుమార్, తోట రవి, పి. శ్రీనివాస్, సీహెచ్ శేఖర్, ధర్మశేఖర్, పవన్ కిషోర్, శ్రీనివాస్, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రికెట్ జట్టు

21 నుంచి జేఎన్టీయూకేలో రాష్ట్రస్థాయి
చెకుముకి సైన్స్ సంబరాలు


సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు కాకినాడ జేఎన్టీయూకేలో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్‌సంబరాలు నిర్వహిస్తున్నట్లు జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. శనివారం కాకినాడ యూటీఎఫ్ హోంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్ అంటూ శాస్త్ర విజ్ఞాన ప్రచారం చేస్తూ చైతన్యపరుస్తోందన్నారు. రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో 200మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు, 200మంది ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులు, జి.మురళీధర్, జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్ వర్మ, జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్. సూర్యనారాయణ, ఎం.రామకృష్ణ, జిల్లా గౌరవా ధ్యక్షుడు వి.సత్యనారాయణరెడ్డి, నగర అధ్యక్షుడు డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్, పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, అయితా బత్తుల రామేశ్వరరావు, వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి అంతర విశ్వవిద్యాలయాల
పురుషుల వాలీబాల్ పోటీలు

జేఎన్టీయూకే, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల పురుషుల వాలీబాల్ పోటీలు ఈనెల 10 నుంచి 14 వరకూ జరుగనున్నాయని రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ టోర్నమెంట్లో సుమారుగా 138 జట్లు పాల్గొంటున్నాయన్నారు. ఈ పోటీలను 4 పూల్స్‌గా విభజించామన్నారు. పూల్ ఏ, బీ పోటీలు జేఎన్టీయూ మైదానంలోనూ.. పూల్ సీ పోటీలు అచ్చంపేటలోని రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ క్యాంపస్‌లోనూ... పూల్ డీలోని జట్లకు సంబంధించిన పోటీలు సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలోనూ జరుగతాయని తెలిపారు. 6రాష్ట్రాల నుంచి 2 వేల మంది క్రీడాకారులు, 250 మంది కోచ్‌లు, మేనేజర్లు, 100 మంది వరకూ వాలీబాల్ టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటున్నారన్నారు. ఈ పోటీల్లో మొదటి 4 స్థానాల్లో నిలిచిన జట్లు అఖిల భారతస్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయని ఆయన తెలిపారు.


10 వరకూ ఆన్‌లైన్‌లో
ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

జేఎన్టీయూకే రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

జేఎన్టీయూకే, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకే ఆధ్వర్యంలో నాణ్యత హామీ, సంస్థ ప్రతిష్ట, అక్రిడిటేషన్ ర్యాంకింగ్స్‌పై దృష్టి అనే అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఈనెల 10 వరకూ ఆన్‌లైన్‌లో కొనసాగుతుందని రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. దీనికి చైర్మన్‌గా సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు, ఈసీఈ అసోసియేట్ ప్రొఫెసర్ లీలాకుమారి సమన్వయకర్తగానూ వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వర్సిటీ అనుబంధ, క్యాంపస్ కళాశాలల నుంచి 348మంది అధ్యాపకులు పాల్గొంటున్నారన్నారు. వరంగల్, రూర్కెలా ఎన్ఐటీలు, సూరత్కల్ ఎన్ఐటీకే, ఓయూ, విట్ వంటిసంస్థల నిపుణులు, ఎన్‌బీఏ, న్యాక్ అక్రిడిటేషన్, ఎన్ఐఆర్ఎఫ్, పరిశోధనా సంస్కృతి, విద్యాప్రావీణ్యత వంటి అంశాలపై సాంకేతిక సెషన్లను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 1న ప్రొఫెసర్ రమేష్, 2న ప్రొఫెసర్ శరత్‌బాబు, 3న వేణుగోపాల్, 4న ఏసురత్నం, 5న శర్మ నిరంతర నాణ్యతాభివృద్ధి, కోర్సు ఫైల్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. శనివారం ప్రొఫెసర్ ఉగ్రసేన్‌సుమన్ సార్ ప్రమాణాల డాక్యుమెంటేషన్‌పై వివరించారు. ఈ కార్యక్రమం అధ్యాపకుల్లో నైపుణ్యాభివృద్ధికి సంస్థల నాణ్యత పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

ముందుగా మేల్కొంటే.. ముప్పుండదు!

- స్క్రబ్ టైఫస్ ప్రాణాంతకం కాదు
- దీర్ఘకాలిక రోగులకు వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరి
- కంగారు వద్దంటున్న వైద్యులు



జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ అనేది ఒక రకమైన జ్వరం. అది నల్లివంటి పురుగు కుట్టిన పిదప ఓరియెన్షియా సుస్ట్ సుగుమాషీ అనే బ్యాక్టీరియా ద్వారా మనిషిలో సంక్రమిస్తుంది. తొలుత జ్వరం వచ్చి పిదప దద్దుర్లతో కూడిన నల్లటి మచ్చ ఏర్పడుతుంది. దానిని ఎస్కార్ అంటారు. ఈ లక్షణాలను గుర్తించిన వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీ లేదా యూపీహెచ్‌సీ లేదా ఏరియా ఆసుపత్రి లేదా జిల్లా ఆసుపత్రికి వెళితే తక్షణం వైద్యం అందించడం ద్వారా ఈ స్క్రబ్ టైఫస్‌ను తరిమి వేయవచ్చు. మధుమేహం, రక్తపోటు, హృద్రోగం, క్షయ తదితర దీర్ఘకాలిక వ్యాధులున్నవారు అప్రమత్తంగా ఉండి స్క్రబ్ టైఫస్ లక్షణాలు కనబడితే వెంటనే అర్హుడైన వైద్యుడిని సంప్రదించాలి. తద్వారా అటువంటి వారికి వైద్యులు డాక్సీ సైక్లిన్, ఎరిత్రోమైసిన్ తదితర ఔషధాల ద్వారా వ్యాధిని నియంత్రిస్తారు.

జీజీహెచ్‌లో 155 మందికి పాజిటివ్

ఇప్పటివరకు కాకినాడ జీజీహెచ్‌లోని వీఆర్‌డీఎల్ ల్యాబ్‌లో నిర్వహించిన వైద్య పరీక్షల్లో 155 మందికి స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అనంతరం వారందరిని దపదఫాలుగా జీజీహెచ్‌లో వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో చికిత్స అందించి డిశ్చార్జ్ చేయడం జరిగింది. గడిచిన నెల రోజులుగా కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఇంజేటి ప్రభాకర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాలు, పాఠశాలలు, వసతిగృహాల్లో స్క్రబ్ టైఫస్ జ్వరాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి వ్యాధి లక్షణాలు, చికిత్సపై వివరించారు. అలాగే పీహెచ్‌సీ వైద్యాధికారులకు జూమ్ మీటింగ్ నిర్వహించి కేసులు వస్తే చికిత్స పద్ధతులపై వివరించారు.

అంటువ్యాధి కాదు



వ్యాధినిరోధక శక్తి బాగా ఉండి పూర్తి ఆరోగ్యవంతులుగా ఉన్నవారికి స్క్రబ్ టైఫస్ వ్యాధి ప్రాణాంతకం కాదు. వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యం అందించి పూర్తిగా నియంత్రించవచ్చు. ఇది ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే అంటువ్యాధి కాదు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలోను ఈ వ్యాధికి సంబంధించిన మందులు పూర్తి స్థాయిలో ఉన్నాయి. స్క్రబ్ టైఫస్ పట్ల ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదు. ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి స్వీయ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత అవసరం.

- డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నాయక్, కాకినాడ

'తూర్పు'లో కేసులు నమోదు కాలేదు

రాజమహేంద్రవరం అర్బన్: తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటి వరకూ స్క్రబ్ టైఫస్ కేసులు నమోదు కాలేదు. అప్రమత్తంగా ఉన్నాం, మందులు సిద్ధంగా ఉన్నాయి. జిల్లాలో అన్ని ఆసుపత్రుల్లో మలేరియా పరీక్షల నిమిత్తం 4,29,911 మందికి రక్తపరీక్షలు నిర్వహించగా ఎలాంటి పాజిటివ్ మలేరియా కేసులు నమోదు కాలేదు. 2,872 మందికి డెంగ్యూ పరీక్షలు చేయగా 32 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. చికెన్ గునియా కేసులు కూడా నమోదు కాలేదు. జీజీహెచ్‌లో స్క్రబ్ టైఫస్ నిర్ధారణ కోసం ర్యాపిడ్ టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం 20 స్క్రబ్ టైఫస్ నిర్ధారణ ర్యాపిడ్ కిట్లు సిద్ధం చేశారు.

- డీఎంహెచ్‌వో, డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, తూర్పుగోదావరి జిల్లా

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



అమలాపురం (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో 11 నెలల్లో 177 పరీక్షలు నిర్వహించగా 17 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయి. వారందరికీ సకాలంలో వైద్య సేవలు అందించడంతో పూర్తిగా కోలుకున్నారు. నల్లిని పోలిన చిన్న కీటకం కుట్టడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. శరీరంపై నల్లటి ఎస్కార్ మచ్చ ఏర్పడుతుంది. వారం, పది రోజుల తరువాత జ్వరం, చలి, వణుకు, తలనొప్పి, కండరాల నొప్పులు, జీర్ణ సమస్యలు, శ్వాస రూపంలో ఇన్ఫెక్షన్‌వస్తుంది. ఈ వ్యాధి బారిన పడిన వారికి సాధారణ యాంటీబయాటిక్స్‌తో వ్యాధి నయమయ్యే అవకాశం ఉంది. సకాలంలో చికిత్స అందకపోతే కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. కాకినాడ వంటి ప్రధాన ఆసుపత్రిలో గల ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్నారు. అనుమానిత కేసులు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ రావడం వల్ల వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ముందస్తు నివారణ చర్యలు తీసుకుంటున్నాం.

- డీఎంహెచ్‌వో, ఎం.దుర్గారావుదొర, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

ప్రభుత్వ కళాశాల వద్ద విద్యార్థుల ఘర్షణ

పోలీసుల కౌన్సిలింగ్

పిఠాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మెగా టీచర్ మీటింగ్ జరుగుతున్న సమయంలోనే కళాశాల బయట ఈ సంఘటన జరిగింది. ఇటీవల తరచూ విద్యార్థులు మధ్య వివాదాలు, ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో ఘర్షణకు దిగిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పట్టణ పోలీసుస్టేషన్ వద్ద కళాశాల అధ్యాపకుల సమక్షంలో సీఐ శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఎటువంటి గొడవలు, ఘర్షణలకు దిగినా, అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొన్నా కఠినచర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. మళ్లీ ఇటువంటి సంఘటనలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని, దీని వల్ల భవిష్యత్తులో ఉద్యోగం పొందే అవకాశాలను కోల్పోతారని తెలిపారు. కౌన్సిలింగ్ అనంతరం ఘర్షణకు దిగిన విద్యార్థులను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. సమావేశంలో ఎస్ఐ మణికుమార్ తదితరులున్నారు.


పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సీఐ

భూపాలపట్నంలో వ్యక్తి హత్య?

దర్యాప్తు చేస్తున్న పోలీసులు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


అప్పన్న (ఫైల్)

కిర్లంపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన కాకర అప్పన్న(48)ను హత్య చేసినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం రాత్రి గ్రామంలోని మెయిన్ రోడ్డులో అప్పన్న అనుమానాస్పదంగా మృతిచెందాడు. అటుగా వెళ్లే ఆటో డ్రైవర్ చూసి పోలీసులకు సమాచారం అందించాడు. జగ్గంపేట, ప్రత్తిపాడు సీఐలు వైఆర్‌కె శ్రీనివాస్, వెంకట అప్పారావు, కిర్లంపూడి ఎస్ఐ సతీష్, జగ్గంపేట ఎస్ఐ రఘునాధరావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు.హత్య కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

గతంలో ఘర్షణ...

కాకర అప్పన్నకు గ్రామానికి కుళ్ల రాజబాబుకు 2024 సెప్టెంబరు 3న ఘర్షణ జరిగింది. తర్వాత గ్రామంలో కిల్లీకొట్టు వద్ద రాజబాబుపై అప్పారావు ఐరన్ రాడ్డుతో కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. అప్పట్లో అప్పారావుపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఇంకా కోర్టులో నడుస్తోందని స్థానికులు తెలిపారు. ఇదిలా ఉండగా శుక్రవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి వస్తున్న అప్పారావును రాజబాబు, మరి కొందరు కలిసి కొట్టి చంపారని మృతుడి సోదరుడు కాకర రాజేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కిర్లంపూడి ఎస్ఐ సతీష్ తెలిపారు. పోలీసు జాగిలం ఘటనా స్థలం నుంచి నేరుగా కుళ్ల రాజబాబు ఇంటికెళ్లి ఆగింది. దీంతో రాజబాబు హత్య చేసి ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రేపటి నుంచి నన్నయలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మూడు క్యాంపస్‌లలో పీజీ కోర్సులకు ఈ నెల 8నుంచి 12 వరకూ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను విశ్వవిద్యాలయంలో శనివారం ఆమె తెలియజేస్తూ నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో పీజీ కోర్సులకు రాజమహేంద్రవరంలో క్యాంపస్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని చెప్పారు. ఎంఏ, ఎంకామ్, ఎంపీఈడీ, ఎంఎస్సీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏపీ పీజీసెట్‌లో అర్హత సాధించలేని వారు, సెట్‌కు హాజరు కాని అభ్యర్థులు పీజీ స్పాట్ అడ్మిషన్లలో ప్రవేశం పొందవచ్చన్నారు. సైన్స్ కోర్సులకు 8,9 తేదీల్లోను, ఆర్ట్స్ కోర్సులకు 10,11 తేదీల్లోను, ఏమైనా సందేహాలు, పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్లు కోసం 12న స్పాట్ అడ్మిషన్‌లు జరుగుతాయని తెలిపారు. నన్నయ రాజమహేంద్రవరం క్యాంపస్‌లో డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరిగే ఈ ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఎస్.నజనారాజ్ పర్యవేక్షిస్తారన్నారు. ఏపీ పీజీసెట్ 2025లో అర్హత సాధించిన అభ్యర్థులు రూ.500, పీజీ సెట్ అర్హత లేని వారు, పీజీ సెట్‌కు హాజరు కాని వారు రూ.800 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని వీసీ సూచించారు.

రేపు కాకినాడలో జాబ్ మేళా

కాకినాడ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో ఈ నెల 8న కాకినాడలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ మేళాలో పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ ఉత్తీర్ణులైన 40ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు సోమవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరు కావాలన్నారు. వివరాలకు 77993 76222 నెంబరును సంప్రదించాలన్నారు.

ఏపీలో బీజేపీ బలపడదు

మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్

రాజమహేంద్రవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీది బయోలాజికల్ పుట్టుక కాదు. తాను దేవుడనని మోదీనే స్వయంగా చెప్పుకుంటున్నారు. రాష్ట్రంలోని రెండు పార్టీలు మోదీకి అనుకూలంగా మారిపోయాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఎద్దేవా చేశారు. రాజమహేంద్రవరంలోని ధర్మంచర హాల్‌లో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. డిసెంబరు 6న రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి కానీ బాబ్రీ మసీదును కూల్చి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిన రోజు కూడా ఇదే. ఏ ప్రభుత్వానికైనా అపరిమిత హక్కులు కల్పించి ప్రజలు మౌనంగా ఉంటే ఆదేశం పతనమవుతుందని ఆనాడే అంబేడ్కర్ చెప్పారని గుర్తు చేశారు. ఇండియా-పాకిస్తాన్ మధ్య తాను రాజీ చేశానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతుంటే మోదీ కనీసం స్పందించకపోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. హిందుత్వం మతం కాదు. అదో సంస్కృతి. సనాతన ధర్మం. అది ఎప్పటికీ పోదు. మనది సెక్యులర్ దేశమని చెప్పారు. పాకిస్థాన్ గురించి భయపడాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. రాజకీయ పరమైన యుద్ధాలను మతపరంగా మార్చి, ప్రజల మధ్య గొడవలు పెడుతున్నారన్నారు. నెహ్రూను దుర్మార్గుడిగా చిత్రీకరిస్తున్న మోదీకి చరిత్ర తెలియదన్నారు. కాంగ్రెస్ ఉనికి లేకుండా చేయడమే బీజేపీ లక్ష్యంగా మాట్లాడుతోందని తెలిపారు.ఆంధ్రలో ఎప్పటికీ బీజేపీ బలపడలేదని స్పష్టం చేశారు. అమాయక భారతీయులను చంపేస్తున్న టెర్రరిస్టులను కాల్చిపడేయాల న్నారు. కోనసీమలో దెబ్బతిన్న కొబ్బరిచెట్ల పరిస్థితిని గురించి చెప్పే సమయంలో తెలంగాణ దిష్టితగిలిందని పవన్ కల్యాణ్ అనడం సరికాదన్నారు. ప్రపంచ నలుమూలల నుంచి రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తున్న చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి జగన్ తమ వ్యాపార సంస్థలను ఆంధ్రకు ఎందుకు తేవడం లేదని ప్రశ్నించారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి ఆసుపత్రిలో చికిత్స

తొండంగి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తొండంగి మండలం అద్దరిపేట పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమ్మరి సుబ్బారావు(59) దుర్మరణం పాలైనట్టు పోలీసులు తెలిపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం రాజీపేటకు చెందిన కుమ్మరి సుబ్బారావు, తన బంధువు నేమాల రామకృష్ణతో కలిసి ఉదయం ఈదటం గ్రామానికి మోటార్‌సైకిల్‌పై వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి వస్తుండగా పెట్రోల్ బంక్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న మరో మోటార్‌సైకిల్ బలంగా ఢీకొట్టింది. దీంతో సుబ్బారావు, రామకృష్ణలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా సుబ్బారావు మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. రామకృష్ణ చికిత్స పొందుతున్నాడు. మృతుడి కుమారుడు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తొండంగి పోలీసులు తెలిపారు.

పెద్దిపాలెంలో భారీ అగ్నిప్రమాదం

- మూడు తాటాకిళ్లు అగ్నికి ఆహుతి
- రూ.10 లక్షల ఆస్తినష్టం
- డాబా ఇల్లు పాక్షికంగా దగ్ధం


అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న గృహాలు

ప్రత్తిపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో శనివారం తెల్లవారుజామున జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో 3 తాటాకిళ్లు పూర్తిగా దగ్ధం కాగా ఒక డాబా ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. ఆరు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెద్దిపాలెంలోని రాళ్ల అప్పారావు, రాళ్ల రాజు, రాళ్ల ఆనందరావులకు చెందిన తాటాకిళ్లకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో గ్యాస్ సిలిండర్ పేలడంతో సమీపంలో ఉన్న పిల్లి సూరిబాబు డాబా ఇల్లు పాక్షికంగా దెబ్బతింది.స్థానికుల సమాచారంతో ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం అగ్నిమాపక సిబ్బందికి విషయం తెలియజేశారు. దీంతో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ఘటనతో నాలుగు కుటుంబాలతో పాటు గుండు బుజ్జమ్మ, బొందలపు కాసులమ్మ కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ఇళ్లలోని బట్టలు,గృహోపకరణాలు, బైక్ కాలిబూడిదయ్యాయి. ప్రమాదంలో రూ.10 లక్షలు పైబడి ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు. కట్టుబట్టలతో మిగిలారు.బాధితులను ఎమ్మెల్యే సత్యప్రభ పరామర్శించి బియ్యం, దుస్తులు, కొంత ఆర్థిక సాయం అందజేశారు. జనసేన నాయకురాలు బార్లపూడి క్రాంతి బాధిత కుటుంబానికి రూ.40 వేలు సాయం అందించారు. ఆమె వెంట జనసేన నాయకులు సూర్నీడి సురేష్, నల్లల రామకృష్ణ, దంతులూరి బోసురాజు తదితరులున్నారు. అలాగే సాయంత్రం నియోజకవర్గ వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు బాధితులను పరామర్శించి ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందించారు. అందజేశారు.


ప్రమాదంలో దగ్ధమైన ఇల్లు

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి


మృతుడు చంద్రరావు

కరప, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వృద్ధుడు మృతిచెందినట్టు కరప పోలీసులు తెలిపారు. కాకినాడ రూరల్ మండలం పగడాలపేట గ్రామానికి చెందిన చోడిపల్లి చంద్రరావు(72) చేపల వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటి నుంచి చొల్లంగి బ్రిడ్జి వైపుకు వెళ్తుండగా ఉప్పలంక సరళ రైస్ మిల్లు ఎదుట గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన చంద్రరావును అంబులెన్స్‌పై కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతుడి కోడలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు కరప ఏఎస్ఐ సూరిబాబు తెలిపారు.

పశువులను కడుగుతుండగా ఫిట్స్..

కాలువలో పడి వ్యక్తి మృతి


మృతుడు సింహాచలం

ప్రత్తిపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పశువులను కాలువలో కడుగుతుండగా ఫిట్స్ రావడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామం దళితవాడకు చెందిన దొండపాటి సింహాచలం(42) శనివారం సాయంత్రం 5గంటల సమయంలో పశువులను రాచపల్లి అడ్డురోడ్డు వద్ద పుష్కర కాలువలోకి మళ్లించాడు. వాటిని కడుతుండగా సింహాచలానికి మూర్ఛ రావడంతో నీటిలో పడిపోయాడు. మునిగిపోయి కొట్టుకోవడాన్ని సమీపంలోని కూలీలు గమనించి ఒడ్డుకు తీసుకువచ్చి సపర్యలు చేశారు. ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సింహాచలం మృతిత గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి

రాష్ట్ర థాంగ్టా పోటీలకు విద్యార్థినుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

బిక్కవోలు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ థాంగ్టా రాష్ట్ర స్థాయి పోటీలకు పందలపాక ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థినిలు ఎంపికయ్యారని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. అండర్-17 విభాగంలో జి.తేజసాయిశ్రీ, అండర్-19 విభాగంలో పి.గీతారమ్యశ్రీ, బి.సత్యప్రసన్న, జి.క్రాంతి ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 7, 8 తేదీల్లో అనకాపల్లి జిల్లా పరవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మార్షల్ ఆర్ట్స్ విభాగానికి చెందిన థాంగ్టా క్రీడకు ఎంపికైన విద్యార్థినులను, శిక్షణ ఇచ్చిన పీడీ యువరాజారెడ్డిని హెచ్ఎంతో పాటు ఎస్‌డీసీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

శృంగారవల్లభుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి శృంగారవల్లభ స్వామిని అధిక సంఖ్యలో భక్తులు శనివారం దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే స్వామి దర్శనానికి బారులు తీరారు.ప్రత్యేక దర్శన టికెట్ల విక్రయం ద్వారా రూ.1,34,140, అన్నదాన విరాళాలు రూ.64,141, కేశఖండన ద్వారా రూ.5,640, తులాభారం రూ.500, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.17,595 వెరసి రూ.2,22,016 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.ఆలయానికి వచ్చే భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారన్నారు.

జీజీహెచ్‌లో కార్డియాలజిస్ట్ నియామకానికి కృషి

ఆసుపత్రి పరిశీలనలో మంత్రి సుభాష్


కాకినాడ జీజీహెచ్‌ను పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌కు హృద్రోగుల తాకిడి అధికంగా ఉన్న నేపథ్యంలో పూర్తిస్థాయి కార్డియాలజిస్ట్ నియామకానికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆయన శనివారం జీజీహెచ్‌లో సందర్శించి కార్డియాలజీ, జనరల్ సర్జరీ వార్డుల్లో చికిత్స పొందుతున్న పలువురిని పరామర్శించి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి నిర్వహణపై సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారిని అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత ఉందని ముఖ్యంగా గుండె వైద్య నిపుణులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నట్టు మంత్రి దృష్టికి తీసుకు రాగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి కార్డియాలజిస్ట్ నియామకానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ కోమలి, అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం

బడుగుల ఆశాజ్యోతి అంబేద్కర్

● కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

● డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళి



ముమ్మిడివరం టీడీపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

ముమ్మిడివరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. శనివారం ముమ్మిడివరం టీడీపీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 69వ వర్థంతి కార్యక్రమంలో మంత్రి పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు రిజర్వేషన్ల లబ్ధి పొందుతున్నారంటే అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లేనన్నారు. ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని పార్లమెంట్‌లో పోరాడి అందరికీ ఓటుహక్కు కల్పించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అన్నారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ఆశయాలు ఎప్పుడూ సజీవంగా ఉంటాయన్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు గుత్తుల సాయి, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, కట్టా సత్తిబాబు, తాడి జానకీరామ్, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, దాట్ల బాబు, మిమ్మితి చిరంజీవి, యాళ్ల ఉదయ్, పిల్లి నాగరాజు, విళ్ల వీరాస్వామినాయుడు, మెండి కమల, బొక్కా రుక్మిణి, వాసంశెట్టి అమ్మాజీ, కుడుపూడి మలీశ్వరిలతో పాటు పలువురు పాల్గొన్నారు. కొమానపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అంబేద్కర్ వర్థంతి కార్యక్రమంలో ఎస్.రాంబాబు, కేవీస్వీ త్రిమూర్తులు, రెడ్డి నాగార్జునరావు, ఎస్ఎన్ మునేశ్వరరావు, పి.సూర్యనారాయణమ్మతో పాటు పలువురు పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగాభవానీ, పరిపాలనాధికారి ఎ.శేషగిరిరావు, జీవిస్‌డబ్ల్యుఎస్ అధికారిణి సుజాత, ఏపీవో టి.రామారావు, ఏపీఎం పి.వెంకటరమణ, నగర పంచాయతీ కార్యాలయంవద్ద జరిగిన వర్థంతి కార్యక్రమంలో కమిషనర్ పి.రవివర్మ, సీనియర్ అసిస్టెంట్లు రామకృష్ణప్రసాద్, సునీత, సీఎం భాస్కరరావు, శ్రీను, మెప్మా నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రి వద్ద జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై.లోకేశ్, సిబ్బంది పాల్గొన్నారు. పోలమ్మచెరువుగట్టున వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, పితాని బాలకృష్ణ, కాశి బాలమునికుమారి, జగతా బాబ్జి, కోలా బాబ్జి, కాశి రామకృష్ణ, దేవరపల్లి ఏడుకొండలుతో పాటు పలువురు పాల్గొన్నారు. ముమ్మిడివరంలోని డాక్టర్ రావుబహదూర్ రఘుపతి వెంకటరత్నంనాయుడు, డిగ్రీ మహిళా కళాశాల, శ్రీకృష్ణదేవరాయ మహిళా జూనియర్ కళాశాలల్లో వర్థంతిని జరిపారు. కాశివానితూము సెంటర్‌లో నిర్వహించిన వర్థంతిలో నాయకులు చెల్లి అశోక్, పెన్మెత్స చిట్టిరాజు పాల్గొన్నారు.

● సీఐటీయూ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి సకిలే సూర్యనారాయణ, మండల నాయకులు నిమ్మకాయల వెంకటేష్‌లు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాము బాలయ్య, దొమ్మేటి వీరరాఘవులు, యలమంచిలి బాలరాజు, పలివెల ప్రసాద్, నిమ్మకాయల మహాలక్ష్మి పాల్గొన్నారు.

అసమానతలు లేని సమాజమే లక్ష్యం

అమలాపురం టౌన్/రూరల్(ఆంధ్రజ్యోతి): అసమానతలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రక్షించారని, ఆయన జీవిత ఆశయానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. అంబేద్కర్ వర్థంతిని పురస్కరించుకుని అమలాపురం నల్లవంతెన వద్ద ఆయన విగ్రహానికి డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబుతో కలసి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్‌చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయ వెంకటలక్ష్మి, కూటమి నాయకులు తిక్కిరెడ్డి నేతాజీ, నల్లా శ్రీధర్, కల్వకొలను తాతాజీ, ఆర్డీఎస్ ప్రసాద్, కంకిపాటి గోపి, లింగోలు పండు, కొప్పుల నాగమానస, నల్లా అజయ్, పిండి రాజా, ఆశెట్టి ఆదిబాబు, భాస్కర్ల రామకృష్ణ, జంగా అబ్బాయివెంకన్న, వలవల శివరావు తదితరులు పాల్గొన్నారు. గడియారస్తంభం సెంటర్‌లో భారత రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ ఆధ్వర్యంలో జరిగిన వర్థంతి కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈవీవీ సత్యనారాయణ, ఉండ్రు శ్యామలరావు, జంగా బాబూరావు, కొంకి వెంకటబాబ్జి, ఊటాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. నల్లవంతెన వద్ద అంబేద్కర్ విగ్రహానికి వైసీపీ జిల్లాశాఖ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, మాజీఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్, నియోజకవర్గ కోఆర్డినేటర్లు డాక్టర్ పినిపే శ్రీకాంత్, పిల్లి సూర్యప్రకాష్, జక్కంపూడి విజయలక్ష్మి, చెల్లుబోయిన శ్రీనివాసరావు, కుడుపూడి బాబు తదితరులు పాల్గొన్నారు. బండారులంక పంచాయతీ కార్యాలయంవద్ద అంబేద్కర్ విగ్రహానికి సర్పంచ్ పెనుమాల సునీత, శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పిచ్చిక వెంకన్న, కాశిన బాబి, అడపా సోమరాజు, బళ్ల శ్రీనివాసచక్రవర్తి, బండి సుబ్బారావు, కొండా సత్యనారాయణరాజు, దంగేటి శ్రీరామ్, గోసంగి సూర్యనారాయణ పాల్గొన్నారు.



అమలాపురంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆనందరావు, డీసీసీబీ చైర్మన్ బాబు, యానాంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు

దేశం గర్వించదగ్గ వ్యక్తి అంబేద్కర్ : ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం (ఆంధ్రజ్యోతి): భారతదేశం గర్వించదగ్గ వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కొనియాడారు. పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీశాఖ ఐటీ సలహాదారుడు పెనుమారెడ్డి నాగబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, వాసంశెట్టి కుమార్, పెద్దిరాజు, కె.సత్యనారాయణరాజు, శ్రీనుబాబు, పాల్గొన్నారు.

అయినవిల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తేశ్వరం సెంటర్‌లో టీడీపీ మండలాధ్యక్షుడు వస్కా శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబాజీపేట ఏఎంసీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎంబీసీ రాష్ట్ర కన్వీనర్ పెండ్ర రమేష్, మాజీ ఎంపీపీలు నలాది పుల్లయ్యనాయుడు, మట్టపర్తి రాజేశ్వరరావు, గుమ్మడి వెంకటేశ్వరరావు, మట్టపర్తి అచ్యుత్, గెల్లా అశోక్, బడుగు భాస్కరజోగేష్, అప్పారి మహేష్, తోటకూర నాగ, జోగి వర్మ, ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి అంజిబాబు పాల్గొన్నారు.

అంతర్వేది(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి, రామేశ్వరం, గొంది, అంతర్వేది దేవస్థానం, అంతర్వేది, అంతర్వేదిదేవస్థానం, మోరి, మోరిపోడు సూర్యనారాయణపేట గ్రామాల్లో అంబేద్కర్ వర్థంతిని నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వేశ్వరాయపురం అంబేద్కర్ సర్కిల్ వద్ద రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య స్థానిక ఎస్సీ సంఘ సభ్యులు, గ్రామస్థులు, టీడీపీ శ్రేణులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముదునూరి చినబాబు, గెడ్డం సింహ, బోళ్ల వెంకటరమణ, అడబాల యుగంధర్, రాపాక నవరత్నం, సాయిబాబురాజు, తాడి సత్యనారాయణ,సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజోలు(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం అంబేద్కర్ పోరాట స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనమని రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. శనివారం తాటిపాక సెంటర్‌లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్థంతి సందర్భంగా అంబేద్కర్, మహాత్మారావు పూలే విగ్రహాలకు శుక్రవారం వారు పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పొదలాడ, రాజోలు, శివకోడులో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కడలి శ్రీదుర్గ, చాగంటి స్వామి, భూపతిరాజు ఈశ్వరరాజువర్మ, అనుచూరి పురుషోత్తం, అడబాల సాయిబాబు, సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, చింతా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. తాటిపాక సెంటర్‌లో దళిత చైతన్యవేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్థంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి రాజోలు వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, జిల్లా అధ్యక్షుడు లిఖితపూడి బుజ్జి, దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లెల్ల వినోద్, బొడ్డపల్లి పుల్లయ్య, చింతా శ్రీనివాస్ పాల్గొన్నారు.

యానాం(ఆంధ్రజ్యోతి):భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు యానాంలో నాయకులు, అధికారులు నివాళులర్పించారు. యానాం సమాచారశాఖ ఆధ్వర్యంలో 69వ వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, యానాం ఇన్‌చార్జ్ పరిపాలనాధికారి డాక్టర్ రవిశంకర్, ఎస్పీ వరదరాజన్ తదితరులు స్థానిక పాతబస్టాండ్, గోపాల్‌నగర్‌లోని అంబేద్కర్ విజ్ఞానభవన్‌లో ఉన్న అంబేద్కర్ నిలువెత్తు విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో యానాం బీజేపీ అధ్యక్షురాలు కనకాల రాజు, యానాం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గిడ్లచంద్రరావు, బడుగు బలరాం, దళిత సంఘల నాయకులు పాల్గొన్నారు.

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పూలమాలలువేసి నివాళులర్పించా రు. మాచవరం పంచాయతీ కార్యాలయంవద్ద సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే గిడ్డి పూలమాలలు వేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, అరిగెల సూరిబాబు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, షైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, పులిదిండి సత్యనారాయణ, నాగరాజు, దొమ్మేటి సాయికృష్ణ, ఉందుర్తి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురులో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అమూల్య



పి.గన్నవరంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

అంబేద్కర్ అందరికీ ఆదర్శనీయుడు

మామిడికుదురు(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందరికీ ఆదర్శనీయుడని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, రాజోలు టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య పేర్కొన్నారు. పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలేవసి నివాళులర్పించారు. మామిడికుదురు సెంటర్‌లో టీడీపీ ఇన్‌చార్జి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులరి ్పంచారు. ఆయా కార్యక్రమాల్లో జనసేన మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, బీజేపీఅధ్యక్షుడు భైరిశెట్టి దుర్గారామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఈలి శ్రీనివాస్, బాబు పాల్గొన్నారు.

ఐ.పోలవరం(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం అంబేద్కర్ వర్థంతిని జరుపుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సాగిరాజు సూరిబాబురాజు, బొంతు ప్రసాద్, రైతు సంఘం నాయకుడు దంగుడుబియ్యం మోహన్, క్లస్టర్ కో కన్వీనర్ నంబూరు సీతారామరాజు, పత్తి నాగబాబు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం(ఆంధ్రజ్యోతి): మాల మహానాడు ఆధ్వర్యంలో ఉప్పలగుప్తం బాలయోగి పార్కులో శనివారం అంబేద్కర్ వర్థంతిని జరుపుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండల మాల మహానాడు అధ్యక్షుడు కొంకి వెంకటబాబ్జి, సర్పంచ్ కడిమి చిన్నవరాజు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, తాళ్ళ రవికుమార్, దోనిపాటి అశోకచక్రవర్తి, కొటుం లోవరాజు, పండు రాజేష్, దోనిపాటి రాంజీ పాల్గొన్నారు.

అల్లవరం(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, ఎంపీడీవో కె.గౌరీకుమారి అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అల్లవరం హైస్కూలు వద్ద జడ్పీటీసీ కొనుకు గౌతమీ, హెచ్ఎం ఎన్.వెంకటేశ్వరరావు పూలమాలలువేసి అంబేద్కర్‌కు నివాళులర్పించారు. రాష్ట్ర మాలమహానాడు కార్యదర్శి నాతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. బోడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళులర్పించారు.

హాస్టల్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి: ఆర్డీవో



గంగలకుర్రు హాస్టల్‌లో విద్యార్థుల దుప్పట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

అంబాజీపేట, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మండలం గంగలకుర్రు మెట్లకాలనీలో ఉన్న సమీకృత ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కారానికి కృషిచేస్తామని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ సూచించారు. గంగలకుర్రు హాస్టల్‌ను శనివారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌ను ఆయన పరిశీలించి అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ప్రస్తుతం చలికాలం కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఆ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు హాస్టల్ ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. హాస్టల్ నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. హాస్టల్‌లో ఫ్యాన్లు పనిచేయడం లేదని ఆ సమస్యలను త్వరలో పరిష్కరిస్తానన్నారు. అలాగే హాస్టల్ సమీపంలోని డ్రైనేజీని వెంటనే శుభ్రం చేయించాలని ఎంపీడీవో బి.మమతను ఆదేశించారు. ఆయన వెంట సోషల్ వెల్ఫేర్ డీడీ జ్యోతిలక్ష్మిదేవి, డిప్యూటీ తహశీల్దారు వెంకటేశ్వరరరావు, ఆర్ఐ ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి ఎన్.సత్యవేణి, వీఆర్వో రమణ, హాస్టల్ వార్డెన్ బి.సత్యనారాయణ ఉన్నారు.

వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయం : ఎమ్మెల్యే దేవ

మలికిపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా నిలిచేందుకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురం మండలం లక్కవరం గ్రామంలో నూతనంగా ప్రారంభించిన శ్రీ హాస్పిటల్‌లో శనివారం ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఆపద్బాంధవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమలాపురం శ్రీసాయివిశ్వాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి ఎమ్మెల్యే దేవ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. లక్కవరం పరిసర ప్రాంతాలతోపాటు సుదూర ప్రాంతాల నుంచి సైతం రోగులు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోగా వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే ప్రత్యేకంగా మహిళలకు క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేశారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది, వైద్య శిబిరం నిర్వాహకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై చిన్నచూపు తగదు: సీఎంవో

మామిడికుదురు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పట్ల చిన్నచూపు తగదని సమగ్రశిక్ష సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం సూచించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మామిడికుదురు విద్యావనరుల కేంద్రంలో గల భవిత కేంద్రంలో శనివారం నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థులచే ఎంపీడీవో జి.భవానీ కేక్ కట్ చేయించి అందరికీ పంచారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఎంవో మాట్లాడుతూ ప్రభుత్వం భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పోటీల్లోని విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్‌సునీల్‌కుమార్, ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, పీఈర్టీలు హిమబిందు, సుశీల, కరుణాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

మలికిపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలం బట్టేలంక భవిత సెంటర్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సర్పంచ్ బోనం సీతారత్నం-అర్జునరావు ఆధ్వర్యంలో శనివారం కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. దివ్యాంగులను ఉద్దేశించి పలువురు మాట్లాడారు. ఎంపీటీసీ ఆవుపాటి లలితాఉమాశివజ్యోతి-సుబ్రహ్మణ్యం, వీరభద్రరావు, ఎంఈవో-1 ఎం.విజయశ్రీ, ఎంఈవో-2 వైవీ సత్యనారాయణ, హెచ్ఎం,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రామకోటి రాస్తే ఏకాగ్రత పెరుగుతుంది'

రాజోలు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామకోటి రాస్తే ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని శృంగవృక్షం దత్త పీఠాధిపతి శ్రీసాయిదత్త నాగానందసరస్వతీస్వామి అన్నారు. రాజోలు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం ఏకదాశ కోటి శ్రీరామనామ లిఖిత జపయజ్ఞంలో భాగంగా భక్తులకు రామకోటి పుస్తకాలు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగానంద సరస్వతీస్వామి మాట్లాడుతూ అయోధ్యలో సంపూర్ణ రామాలయం పూర్తయిన సందర్భంగా అయోధ్య రాములవారికి 1100 పుస్తకాలను 11 కోట్ల రామనామ జపాలను లిఖించేందుకు సంకల్పించగా ఇప్పటివరకు 35 కోట్లు దాటాయని తెలిపారు. వచ్చే ఏడాది మే 12వ తేదీ నాటికి జరిగే హనుమజ్జయంతి రోజుకు108 కోట్ల రామకోటి పుస్తకాలు రాసి ఆధ్యాత్మికశోభ సంతరించుకునేలా కోనసీమ వాసులు కృషి చేయాలని ఆయన కోరారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, టీటీడీ ధార్మికసంఘం సభ్యులు జి.నాగరాజు, అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, అడబాల సత్యనారాయణ, కాసు శ్రీను, భవానీ, రాజానాగరత్నకుమార్ పాల్గొన్నారు.



రాజోలులో భక్తులకు రామకోటి పుస్తకాన్ని అందిస్తున్న శ్రీసాయిదత్త నాగానంద సరస్వతీ స్వామి

'వైసీపీ ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలి'

అమలాపురం టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గతంలో వైసీపీ ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్న ప్రధాన డిమాండ్‌తో ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన చైతన్యయాత్ర శనివారం అమలాపురం చేరుకుంది. రాష్ట్ర అధ్యక్షత, ప్రధాన కార్యదర్శులు బాజీపఠాన్, కరిమి రాజేశ్వరరావులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా సీపీఎస్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు ఉద్యమ కార్యాచరణ కొనసాగిస్తామని హెచ్చరించారు. జిల్లా రెవెన్యూ అధికారి కొత్త మాధవికి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏపీసీపీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చీర్ల కిరణ్, నక్కా వెంకటరత్నం, ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా శాఖ అధ్యక్షుడు మద్దాల బాపూజీ, ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల మల్లేశ్వరరావు, యూనియన్ నాయకులు రాజులపూడి శ్రీపతిరావు, వీహెచ్ఎస్ వర్మ, అడపా నాగేశ్వరరావు, కుడుపూడి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



డీఆర్వో మాధవికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

పీఏసీఎస్ కార్యాలయం ప్రారంభం



ఎ.వేమవరంలో పీఏసీఎస్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎ.వేమవరంలో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, సర్పంచ్ గోకరకొండ వాసు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి-బాబు, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, కూటమి నాయకులు ఆర్డీఎస్ ప్రసాద్, అధికారి బాబ్జి, కల్వకొలను తాతాజీ, నల్లా శ్రీధర్, మట్టా మహాలక్ష్మిప్రభాకర్, సూదా చిన్నా, కొప్పుల నాగమానస, లింగోలు పండు పాల్గొన్నారు.

సైనిక సంక్షేమ నిధికి మహిళా వాకర్స్ విరాళం

అమలాపురంటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆర్మ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే సందర్భంగా సైనిక సంక్షేమనిధికి మహిళా వాకర్స్ సభ్యులు రూ.35వేలు చందా అందించారు. అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు కూచిమంచి నాగమణి ఈ నిధికి రూ.25వేలు అందించగా ఆమె సోదరీమణులు బాపనమ్మ, జానకీ రూ.5వేలు చొప్పన విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి, బులెటిన్ ఎడిటర్ పుత్సా కృష్ణకామేశ్వర్, మాజీ సైనికోద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దొంగ మూర్తి, కార్యదర్శులు రాంబాబు, శ్రీనివాసరావు, గోటేటి గంగాధరరావు పాల్గొన్నారు. అనంతరం విరాళం అందించిన నాగమణిని ఘనంగా సత్కరించారు.

మొగలికుదురులోనే ఇళ్లస్థలాలు పంపిణీ చేయాలి

మామిడికుదురు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మొగలికుదురు గ్రామంలోనే తమకు ఇళ్లస్థలాలు కేటాయించాలంటూ గ్రామస్థులు శనివారం తహశీల్దార్‌ను కలసి డిమాండ్ చేశారు. దీని గురించి గ్రామ పంచాయతీవద్ద నిరసన తెలిపి తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. వారి డిమాండ్‌లను ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, జాలెం శ్రీనివాసరాజాలు తహశీల్దార్‌కు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్వో ఆర్.రూస్సీరాణి పాల్గొన్నారు.

అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్ వార్షికోత్సవం

అమలాపురంటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. సెక్రటరీ జనరల్ డీబీ లోక్, చైర్మన్ నాగాబత్తుల ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత బుద్ధవిహార్‌లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో బుద్ధిస్టులు, అంబేద్కరీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పెనుమాల చిట్టిబాబు, ఐఎన్ మల్లేశ్వరరావు, బాలరవి, దోనిపాటి నాగేశ్వరరావు, కోడూరి రామ్మూర్తి, రేవు ఈశ్వరరావు, గెడ్డం భాస్కరరావు పాల్గొన్నారు.

తాత్కాలిక రహదారి పనులు నిలిపివేయాలి


● లంకగ్రామస్తులకు తహశీల్దార్ శ్రీపల్లవి సూచన



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్ఐ డాంగే

పి.గన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైవిపాలెం దిగువన లంకలో పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలానికి చెందిన అనగార్లంక, పెదమల్లంక రెండు గ్రామాలు ఉంటాయి. వరదలు అనంతరం వాహనాల రాకపోకలు కోసం తాత్కాలిక రహదారి ఏర్పాటు చేసుకుంటారు. ఈక్రమం లోనే శనివారం లంక గ్రామస్థులు ఎక్స్‌కవేటర్‌తో తాత్కాలిక రహదారి ఏ ర్పాటు చేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ తాత్కాలిక రహదారి పనులు నిలిపివేయాలని ఆదేశాలు జారీచేశారు. ఆర్ఐ డాంగే రెవెన్యూ సిబ్బందితో బాటవద్దకు చేరుకుని పనులు నిలిపివేయాలని కోరారు. దీంతో లంకగ్రామస్తులు తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని గ్రామస్థుల వాహనాలు మాత్రమే రాకపోకలు సాగిస్తాయని తాత్కాలిక రహదారి ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. గ్రామస్థులు విన్నపం మేరకు అక్రమ ఇసుకతో వాహనాలు రాకపోకలు సాగించకుండా పూచికత్తు రాసిస్తే అనుమతులు ఇస్తామని చెప్పినప్పటికీ శుక్రవారం రాత్రి వాహనాలు సీజ్ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని బాటకు అనుమతులు నిరాకరించారు. గతేడాది కూడా ఇదే మాదిరిగా బాట వేసుకున్నారని తీరా... అక్రమ ఇసుక, మట్టి తవ్వకాలు విచ్చలవిడిగా జరిగాయని మండిపడ్డారు. హెడ్‌వర్క్స్ అధికారుల అనుమతులు కూడా తీసుకోవాలని అనంతరం బాట కోసం ఆలోచిద్దామని తాత్కాలికంగా పనులు నిలిపివెయ్యాలని లంకగ్రామస్తులకు సూచించారు. కాగా లంకగ్రామస్తులు, రైతులు రాకపోక లు సాగించే వైవీపాలెం వంతెన కూడా శిథిలావస్థకు చేరిందని ఇసుక, మ ట్టితో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే ఆ..వంతె న కాస్త కూలిపో తుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కల్పించు కుని ఈవంతెనపై భారీ వాహనాల రాకపోకలను అడ్డుకోకపోతే రాబోయే కాలంలో లంకగ్రామస్థులకు దారేఉండదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆదిలక్ష్మి కుటుంబానికి అండగా ఉంటాం : డీటీవో శ్రీనివాస్



పి4 స్ఫూర్తితో ఆదిలక్ష్మిని దత్తత తీసుకున్న డీటీవో శ్రీనివాస్

అంతర్వేది, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దుర్గాప్రసాద్ తల్లి కామాడి ఆదిలక్ష్మిని పీ4 స్ఫూర్తితో డీటీవో శ్రీనివాస్ దత్తత తీసుకున్నారు. ఆమె స్వగృహానికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బంది వచ్చినా తనకుఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు.

హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ

అంతర్వేది, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు మండల పోలీసుల ఆధ్వర్యంలో హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాజోలు సీఐ టీవీ నరేష్ పాల్గొని వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించి హెల్మెట్ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ఎస్ఐ దుర్గాశ్రీనివాస్ రోడ్డుపై ఫ్యామిలీతో వెళుతున్న 20మంది ద్విచక్ర వాహనదారులకు సీఐ నరేష్ ఉచితంగా హెల్మెట్లు అందించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ చిట్టిబాబు, పోలీసులు పాల్గొన్నారు.

'మార్కుల కన్నా నైపుణ్యాలదే కీలకపాత్ర'

మలికిపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సాధనలో మార్కుల కన్నా నైపుణ్యాలదే కీలక పాత్ర అని సాఫ్ట్‌స్కిల్ ట్రైనర్ బాను పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలలో గత ఆరు రోజులుగా జరుగుతున్న విద్యార్థుల నైపుణ్య శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. టెక్ మహీంద్ర కంపెనీ సౌజన్యంతో నడుస్తున్న నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడిచిన ఈ కార్యక్రమంలో 70 మంది విద్యార్థులు పాల్గొని ప్రాంగణ నియామ కాలకు అవసరమైన నైపుణ్యాలు సంపాదించుకోవడంపట్ల సంస్థ సెక్రటరీ, కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యనారాయణమూర్తి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్.ఆనంద మహానీ, ఎన్.రమేష్‌బాబు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ పి.సూర్యనారాయణరాజు, మనస్వే పాల్గొన్నారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక

పి.గన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం గ్రేస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారంరాత్రి జరిగిన ఎస్టీయూ మండల శాఖ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలశాఖ గౌరవాధ్యక్షుడిగా కొమర జాన్ ప్రసాద్, అధ్యక్షుడిగా కొప్పుల సత్యవేణి, ప్రధాన కార్యదర్శిగా కాపవరపు గోపాలకృష్ణ, ఆర్థిక కార్యదర్శిగా నీతిపూడి శ్రీనివాసు, అభయ్ కన్వీనర్‌గా ముద్రగళ్ల జగదీశ్వరరావులను ఎస్టీయూ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రోడ్లపై సంచరిస్తున్న ఆవుల తరలింపు

కాట్రేనికోన, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శుక్రవారం రాత్రి ఎస్ఐ అవినాష్, సర్పంచ్ గంటి వెంకటసుధాకర్ ఆధ్వర్యంలో రోడ్లపై తిరుగుతున్న పశువులను బంధించి, వాహనాలపై కరవాక ప్రాంతానికి తరలించారు. రోడ్లపై ఎక్కడ పశువులు కన్పించినా దూర ప్రాంతాలకు తరలిస్తామన్నారు.

రబీ సాగుపై రైతు సమావేశం

కాట్రేనికోన, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శనివారం కాట్రేనికోన-2 రైతు సేవాకేంద్రంలో రబీ సాగుపై రైతులకు మండల వ్యవసాయాధికారి సమావేశం నిర్వహించారు. విత్తనాలు కిలో రూ.5లు రాయితీపై సరఫరా చేస్తామన్నారు. ఎంటీయూ-1121 రకం మాత్రమే ఇస్తామన్నారు. 30 కిలోల ధర 1,260కాగా రాయితీ పోను 1,110లు చెల్లించాలన్నారు. చెయ్యేరు, కందికుప్ప, కాట్రేనికోనల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

రెండు గ్రామాల మధ్య సాగునీటి వివాదం

• ఒకరిపై మరొకరు కేసులు • సమస్య పరిష్కారానికి చర్యలు



సాగునీటి వివాదం పరిష్కారానికి కొలతలు వేస్తున్న అధికారులు, నాయకులు

ఆలమూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రెండు గ్రామాల రైతుల మధ్య సాగునీటి కోసం ఏర్పడిన వివాదం ఏకంగా ఒకరిపై మరొకరు కేసులు పెట్టుకోవడంతో వివాదం ముదిరింది. ఆలమూరు మండలం పినపళ్ల, కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి గ్రామాల రైతుల మధ్య సాగునీటి కోసం రెండు నెలలుగా సాగుతున్న వివాదం పరిష్కారానికి చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు అధ్వర్యంలో రైతులను ఒప్పించి వివాదం పరిష్కారానికి జరుగుతున్న కృషిలో భాగంగా శనివారం ఇరుగ్రామాల రైతుల సమక్షంలో కాలువపై కొలతలు జరిపారు. చొప్పెల్ల లాకుల వద్ద నుంచి వెదురుమూడి వరకు ఉన్న కాలువపై పినపళ్ల వద్ద బ్రిటీష్ కాలంలో డ్యామ్‌ను నిర్మించారు. పినపళ్ల గ్రామానికి చెందిన భూములు ఎత్తుగా ఉండటంతో డ్యామ్‌ను నిర్మించి సాగునీరు సక్రమంగా వెళ్లేలా అప్పట్లో ఏర్పాటు చేశారు. ఇటీవల డ్యామ్ శిథిలావస్థకు చేరడంతో రాతితో నిర్మించిన ఈ డ్యామ్ రాళ్లు లేచిపోవడంతో వాటిని తొలగించి పినపళ్ల రైతులు ఇటీవల కొత్తగా ఎత్తు పెంచారు. ఎత్తు పెంచడం వల్ల దిగువన ఉన్న వెదురుమూడి, అంగర ఆయకట్టు భూములకు సాగునీరు వెళ్లడం కష్టమవుతుందని దిగువ ప్రాంత రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎత్తు తగ్గిస్తామని పినపళ్ల గ్రామానికి చెందిన సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు జంగం రామారావు వారికి హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. ఇచ్చిన హామీ మేరకు ఎత్తు తగ్గించకపోవడంతో దిగువ ప్రాంత రైతులు వచ్చిన డ్యామ్ ఎత్తును తగ్గించే విధంగా వేసిన కాంక్రీట్‌ను తొలగించారు. దీంతో ఇరు గ్రామాల రైతుల మధ్య వివాదం ఏర్పడి ఒకరినొకరు కేసులు పెట్టుకున్నారు.

నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి అధ్వర్యంలో పరిష్కారానికి కృషి: ఇరు గ్రామాల రైతుల మధ్య ఏర్పడిన వివాదం పరిష్కారానికి చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు అధ్వర్యంలో శనివారం చర్యలు చేపట్టారు. గతంలో ఉన్న విధంగా డ్యామ్ ఉండేలా భూముల ఎత్తు ఆధారంగా కొలతలు వేసేలా ఒప్పందం చేశారు. ఇరిగేషన్ ఆలమూరు ఏఈ కృష్ణ త్రిమూర్తులు అధ్వర్యంలో పలువురు సిబ్బంది కొలతలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఆ మేరకు డ్యామ్ ఎత్తు చేస్తారని గారపాటి శ్రీనివాసరావు తెలిపారు.

భీమేశ్వరాలయంలో రాష్ట్ర సమాచార కమిషనర్ పూజలు

ద్రాక్షారామ,డిసెంబరు(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని శనివారం రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ సందర్శించారు. ఆయనకు ఆలయ సహాయ కమీషనర్ అల్లు వెంకట దుర్గాభవానీ స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శన అనంతరం నంది మండపంలో వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆయన వెంట ఆర్డీవో అఖిల, ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

సతీష్‌రావుకు మాతృ వియోగం

ద్రాక్షారామ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు, హసన్‌బాద సర్పంచ్, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్‌రావుకు మాతృ వియోగం కలిగింది. ద్రాక్షారామ నాటక కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత నాగిరెడ్డి సత్యనారాయణ సతీమణి, ప్రస్తుత అధ్యక్షుడు నాగిరెడ్డి సతీష్ రావు తల్లి నాగమణి మృతి చెందారు. శనివారం అంత్యక్రియలు హసన్‌బాదలో నిర్వహించారు. జడ్పీమాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ దామిశెట్టి గంగాపురుషోత్తం, బీజేపి నాయకులు ఆకేటి శ్రీకృష్ణ, వాడ్రేవు వెంకట్రావు, పుల్లెల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ

రావులపాలెం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి వచ్చే భక్తులతో రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ శనివారం కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు వాడపల్లి వెళ్లేందుకు రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రావడంతో కాంప్లెక్స్ ఆవరణలో రద్దీ నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఈ రద్దీ కొనసాగింది.

ఆశలన్నీ ఆవిరి కావాల్సిందేనా?

• వెదురుమూడి రోడ్డు అభివృద్ధికి నిధులు ఆటంకం • తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అభివృద్ధికి నోచుకోని దుస్థితి

ఆలమూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తమ రోడ్డుకు నిధులు మంజూరు అయ్యాయి.. త్వరలో రోడ్డు నిర్మాణం జరుగుతుందని వెదురుమూడి రోడ్డుపై రాకపోకలు సాగించే వారు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. నిధుల కొరత కారణంగా రోడ్డు నిర్మాణం జరగడం లేదనే నిజం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలమూరు మండలం నర్సిపూడి నుంచి సంధిపూడి వరకు దాదాపు 9 కిలోమిటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. నిధుల కొరత కారణంగా రూ.3.8 కోట్ల నిధులు కేటాయించడంతో కొంత మేర రోడ్డు నిర్మాణం తగ్గించేందుకు ఆర్‌అండ్‌బి అధికారులు నిర్ణయించడంతో నర్సిపూడి నుంచి చింతలూరు వరకు రోడ్డు నిర్మాణం చేయడానికి నిధులు సర్దుబాటు చేశారు. ముఖ్యంగా ప్రమాదాలకు నిలయంగా మారిన చింతలూరు నుంచి వెదురుమూడి రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. రోడ్డు నిర్మాణం నిలిచిపోవడంతో మండలంలోని సంధిపూడి, పినపళ్ళ, పెదపళ్ల, చింతలూరు ప్రజలకు ఇబ్బందులతోపాటు ఈ రోడ్డులో రాకపోకలు సాగించే కపిలేశ్వరపురం మండల వాసులకు సమస్య అలానే కొనసాగే పరిస్థితి దాపురించింది.



అధ్వానంగా ఉన్న వెదురుమూడి రోడ్డు దుస్థితి

ఓఎన్జీసీ వాహనాల జోరు

ఇటీవల పినపళ్ల పరిధిలో ఓఎన్జీసీ కొత్తగా డ్రిల్ చేయడానికి సైట్ ఏర్పాటు చేయడంతో ఆసైట్‌కు వచ్చే వాహనాలతో రోడ్డు మరింత అధ్వానంగా మారింది. సింగిల్ రోడ్డు కావడంతో భారీ వాహనాలు వస్తే ద్విచక్ర వాహనదారులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ఓఎన్జీసీ వాహనాల రాకపోకలతో సంధిపూడి నుంచి కొత్తూరుకు వచ్చిపోయే వాహనదారులు దాని వెనకాల వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు తరచూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు వాహనాలు ఎదురుగా వస్తే గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుబడిపోతున్నారు. అధికారులు, నాయకులు ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను గుర్తించి తక్షణం రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మందపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే భక్తులు స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,30,420 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనరు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.

ఇంటి పన్నుల వసూళ్లు సకాలంలో పూర్తిచేయాలి

డీపీవో శాంతకుమారి

ఆలమూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల వసూళ్లను మరింత వేగవంతం చేయాలని అంబేడ్కర్ కోనసీమ జిల్లా పంచాయతీ అధికారి శాంత కుమారి సూచించారు. మండలంలో శనివారం ఆలమూరు, పెదపళ్ల పంచాయతీల్లో ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇంటి పన్ను ద్వారా వసూళ్లు చేసిన మొత్తాన్ని వెంటనే పంచాయతీ ఖాతాలకు జమ చేయాలని, వాటిని జమ చేయకుంటే వారిపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తడి,పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి వాటిని ఆయా సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. సంపద కేంద్రాల నుంచి వచ్చే ఆదాయాన్ని ఎప్పటికప్పుడు పంచాయతీలకు జమ చేయాలని డీపీవో సూచించారు. ఈ సందర్భంగా ఈ గ్రామాల్లో పంచాయతీ రికార్డులు, ఇంటిపన్ను వసూళ్ల రికార్డును పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆలమూరు, పెదపళ్ల పంచాయతీ కార్యదర్శులు మోక్షాంజలి, వేణు, పలువురు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



పెదపళ్లలో ఇంటిపన్ను వసూళ్ల రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో శాంతకుమారి

9 నుంచి ర్యాలి ఆలయంలో పవిత్రోత్సవాలు



ఆత్రేయపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి ఆలయంలో మంగళవారం నుంచి పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి తెలిపారు. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు 3 రోజులపాటు శ్రీనివాసుల వెంకటాచార్యులు బ్రహ్మత్వంలో పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మంగళవారంనాడు గోపూజ, గో ప్రదక్షిణ, హోమం, దీక్షాధారణ, అంకుర్పారణ, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. బుధవారంనాడు ఉత్సవ మూర్తులకు అభిషేకం, పవిత్రాల ఊరేగింపు, 11న స్వామివారికి పవిత్రాల సమర్పణ, శాంతి కల్యాణంతో పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఈవో తెలిపారు.

ఉమాకమండలేశ్వరస్వామి ఆలయంలో సోలార్ పవర్ సిస్టమ్ బహూకరణ: ర్యాలి ఉమా కమండలేశ్వరస్వామి దేవస్థానానికి ర్యాలి సుబ్బారావు జ్ఞాపకార్థం భార్య లక్ష్మీమాణిక్యాంబ, చెన్నైకి చెందిన పీవీవీ సుబ్రహ్మణ్యం-సుబ్బలక్ష్మి దంపతులు రూ.1.50 లక్షల విలువైన సోలార్ రూఫ్ టాప్ పవర్ ప్లాంట్ సిస్టమ్ ను బహుకరించినట్టు ఆలయ ఈవో రమణమూర్తి తెలిపారు.





మండపేట టీడీపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కూటమి నాయకులు. పక్క చిత్రంలో ఆలమూరు మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్‌కి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో రాజు



కొత్తపేట సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు



వెలంపాలెంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేద్దాం

వర్ధంతి సభలో ఎమ్మెల్యేలు బండారు, వేగుళ్ల

కొత్తపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారత ప్రజాస్వామ్యానికి పునాది అంబేడ్కర్ అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని పాత బస్టాండ్ సెంటర్లో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మండల పరిషత్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బండారు పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, ధరణాల రామకృష్ణ, పాలూరి సత్యానందం, బూసి భాస్కరరావు, బీర ఇసాక్, పల్లికొండ సుధీర్ కుమార్, గనిశెట్టి వీరేష్, బూసి విష్ణుమూర్తి, సరెళ్ళ రాజబాబు, నల్లా వెంకటరమణ, విళ్ల మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆలోచనలు ఆదర్శనీయమని స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం టీడీపీ కార్యాలయంలో స్థానిక కూటమి నాయకులతో కలిసి ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. మండపేటలోని న్యూకాలనీ, ఎస్సీ కాలనీల్లో కూడా వర్ధంతిని జరుపుకున్నారు. ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూళి జయరాజు, న్యూకాలనీలో కొవ్వాడ అప్పన్నబాబుతోపాటు మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి తదితరులు వర్ధంతిలో కార్యక్రమంలో నివాళులర్పించారు. మండపేటలోని ఆయా పంచాయతీలు, గ్రామ సచివాలయాలు, మండల పరిషత్ కార్యాలయంతో పాటు రెవెన్యూ కార్యాలయం, పోలీసుస్టేషన్, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు.

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతిని మండలంలోని ఆయా ప్రాంతాల్లో శనివారం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలకు పలువురు నివాళులర్పించారు. ఆలమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎ.రాజు అధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్, మండల పరిషత్ ఏవో మోహర్ ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ), (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం రామచంద్రపురం పట్టణం, మండలంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. రామచంద్రపురంలో ఏఐటీయూసీ, ప్రజా నాట్యమండలి కళాకారులు మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన జరిపారు. ఏఐటీయూసీ పట్టణ గౌరవ అధ్యక్షుడు కెవిఆర్‌కె రాజు, అధ్యక్షుడు వుండవిల్లి గోపాలరావు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పెదిరెడ్డి రాము, పార్టీ సభ్యులు తారకేశ్వరావు, వై.నాగమణి, ఆర్. సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. జనసేన కార్యాలయంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. వైసీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనరు గాదంశెట్టి శ్రీధర్, పోలినాటి వరప్రసాద్ పాల్గొన్నారు. రామచంద్రపురం మండలం హసన్‌బాదలో అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ తదితరులు నివాళులర్పించారు.

అంబేడ్కర్ మార్గం అనుసరిద్దాం: అంబేడ్కర్ మార్గం అనుసరించాలని పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఎస్సీ బాలికల ఉన్నత పాఠశాల, కాలేజీ వసతిగృహంలో నిర్వహించిన వర్ధంతి సభలో అంబేడ్కర్ చిత్రపటానికి బి.సిద్దూ, వసతిగృహ సంక్షేమాధికారిణిలు లోవలక్ష్మి, సీతాదేవి నివాళులర్పించారు. కార్యక్రమంలో రేవతి, మౌనిక, నాగేశ్వరి, సిరి, వరలక్ష్మి, విమలజ్యోతి పాల్గొన్నారు.

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటాలకు అధికారులు నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు అంబేడ్కర్ యువజన సంఘాల అధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు.

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని వైసీపీ కార్యాలయం వద్ద పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పార్టీ శ్రేణులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీహెచ్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మండలంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో అంబేడ్కర్ చిత్రపటానికి అధికారులు, నాయకులు నివాళులర్పించారు.

రాయవరం(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం రాయవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయం సముదాయంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు దేవిశెట్టి కోటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అపరిశుభ్ర వాతావరణంపై ఆవేదన: రాయవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సముదాయంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద అపరిశుభ్ర వాతావరణంపై మండల ప్రజా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు పోలిమాటి సుధాకర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్దకు వచ్చే సరికి అక్కడున్న పరిస్థితిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై దళిత సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని ఆయన అన్నారు.

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ అడుగుజాడల్లో పయనించాలని వక్తలన్నారు. శనివారం కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అంబేడ్కర్ వర్ధంతి సభలో ఏవో రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో వరప్రసాద్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక దళితవాడ వద్ద గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, కార్యదర్శి కె.శివచక్రవర్తి, ఉపాధి హామీ సిబ్బంది, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెలంపాలెంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు

ద్రాక్షారామ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వెలంపాలెంలో ద్రాక్షారామ పరిసర ప్రాంతాల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో జంగారెడ్డిగూడెంనకు చెందిన బ్రదర్ భరత్ కుమార్ క్రిస్మస్ సందేశం అందించారు. అంతర్జాతీయ ప్రసంగీకులు రాజా అంబేడ్కర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఫెలోషిప్ ఫౌండర్ పి. ఎన్. జేసు పాదం క్రిస్మస్ కేకు కట్ చేశారు. కార్యక్రమంలో ఫెలోషిప్ అధ్యక్షుడు కృపానందం, ఫెలోషిప్ చైర్మన్ కె.ఆనంద్‌కుమార్, కార్యదర్శి విజయరత్నం, జిల్లా అడ్వైయిజర్ వి.సురేష్, ఎన్ఎస్ బాబు, జోన్ జాయింట్ సెక్రటరీ వి.ఆశీర్వాదం, కె.పాల్‌రాజు, వి.ఎస్.ప్రసాద్, ఎస్. హిజ్కియా రాజు, మోజేష్, సందీప్, జీవానందం, జాన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ నాటికి కమ్యూనిటీ హాల్ ప్రారంభిస్తాం

మండపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండపేటలో నిర్మించిన క్రైస్తవ కమ్యూనిటీ హాల్‌ను క్రిస్మస్ నాటికి ప్రారంభిస్తామని స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన స్థానిక నేతలు, మున్సిపల్ అధికారులతో కలిసి కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. క్రిస్మస్ నాటికి ప్రారంభించి అందులో వేడుకలు జరుపుకునేలా చేస్తామన్నారు. ఆయన వెంట రెవరెండ్ ఉదయ భాస్కర్, మున్సిపల్ కౌన్సిలర్ నవరపు సతీష్, పెందుర్తి ప్రదీప్, డీఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తాపేశ్వరం-ద్వారపూడి మధ్య రాకపోకలు నిలుపుదల

మండపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం తాపేశ్వరం-ద్వారపూడి మధ్య ఆదివారం వాహనాల రాకపోకలను నిలుపుదల చేస్తున్నామని రహదారులు భవనాల శాఖ డీఈఈ సూర్యనారాయణ తెలిపారు. రెండు గ్రామాల మధ్య వున్న కల్వర్టులను మరమ్మతులను చేస్తున్న నేపథ్యంలో రాకపోకలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నిలుపుదల చేస్తున్నామన్నారు. వాహనదారులు, ప్రజలు సహకరించాలని శనివారం ఒక ప్రకటనలో ఆయన కోరారు.



వెలగతోడు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు మైక్‌సెట్‌ను అందిస్తున్న ఉపాధ్యాయుడు

పాఠశాలకు మైక్ సెట్ అందజేత

మండపేట, డిసెంబరు,6(ఆంధ్రజ్యోతి) మండపేట మండలంల వెలగతోడు జిల్లా పరిషత్ హైస్కూల్లో పనిచేస్తూ బదిలీపై కేశవరానికి వెళ్లిన ఉపాధ్యాయుడు చోడే కృష్ణమూర్తి శనివారం పాఠశాలకు మైక్ సెట్‌ను అందజేశారు. ఆయన తన సొంత నిధులతో వైర్‌లెస్ మైక్‌సెట్‌ను అందించారని హెచ్‌ఎం చోట్టి శ్రీనివాసరావు తెలిపారు. బదిలీపై వెళుతున్న కృష్ణమూర్తికి శనివారం సహచర ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన్ను పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు.



దివ్యాంగ విద్యార్థులతో ఎంపీపీ నాగమణి, ఎంఈవో నాగరాజు తదితరులు

భవిత కేంద్రం సేవలు ప్రశంసనీయం

కె.గంగవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు ప్రసంశనీయం అని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. శనివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఎంఆర్‌సీ కార్యాలయంలో నిర్వహించారు. దీనికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల విద్యార్థుల కోసం ప్రభుత్వం కొన్ని ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేస్తుందని చెప్పారు. అటువంటి వారిని ఆయా పాఠశాలల్లో చేర్పించి వారి భవితకు పునాది వేయాలని సూచించారు. సమగ్రశిక్ష భవితా కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, మానసిక వైకల్యం, వినికిడి లోపం, దృష్టిలోపం ఉన్న పిల్లలకు ఇస్తున్న శిక్షణపై వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో1 ఏ. నాగరాజు, ఎంఈవో2 చోడిశెట్టి అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'రామకోటి రాస్తే ఏకాగ్రత పెరుగుతుంది'

రాజోలు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామకోటి రాస్తే ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని శృంగవృక్షం దత్త పీఠాధిపతి శ్రీ సాయిదత్త నాగానందసరస్వతీస్వామి అన్నారు. రాజోలు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం ఏకదాశ కోటి శ్రీరామనామ లిఖిత జపయజ్ఞంలో భాగంగా భక్తులకు రామకోటి పుస్తకాలు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగానందసరస్వతీస్వామి మాట్లాడుతూ అయోధ్యలో సంపూర్ణ రామాలయం పూర్తయిన సందర్భంగా అయోధ్య రాములవారికి 1100 పుస్తకాలను 11కోట్ల రామనామ జపాలను లిఖించేందుకు సంకల్పించగా ఇప్పటివరకు 35 కోట్లు దాటాయని తెలిపారు. వచ్చే ఏడాది మే 12వ తేదీ నాటికి జరిగే హనుమజ్జయంతి రోజుకు108 కోట్ల రామకోటి పుస్తకాలు రాసి ఆధ్యాత్మికశోభ సంతరించుకునేలా కోనసీమ వాసులు కృషి చేయాలని ఆయన కోరారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, టీటీడీ ధార్మికసంఘం సభ్యులు జి.నాగరాజు, అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, అడబాల సత్యనారాయణ, కాసు శ్రీను, భవానీ, రాజానాగ రత్నకుమార్ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన వైభవ వెంకటేశ్వరస్వామివారు

భక్తులతో పోటెత్తిన వెంకన్న ఆలయం

కపిలేశ్వరపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంగరలోనున్న శ్రీ వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఆలయ అర్చకులు కె.బాలబాలాజీ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక గ్రామస్థులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు, ఆలయ కమిటీ పాల్గొన్నారు.